జర్నలిస్టులు కావలెను

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక
గత 15 సంవత్సరాలుగా పత్రికా
రంగంలో ప్రత్యేక గుర్తింపు
కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన
పత్రికలో పనిచేసేందుకు
ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు
కావలెను.

గుంటూరు



APTEL /25/A2478

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 259 సోమవారం 01- 06 - 2026 పేజీలు : 4 వెల. 2/-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.



సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు
98497 07349


# పాక్ కుట్ర...

## ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి టెలికం సిగ్నల్స్




ఇంటర్నెట్ డెస్క్: భారత్‌లోకి ఉగ్రవాదుల చొరబాట్లను ప్రేరేపించే పాక్ వారికి సాయంగా అక్రమ టెలికం సిగ్నల్స్‌ను ప్రసారం చేస్తోంది. భారత నిఘా వర్గాలకు చిక్కకుండా సమాచార మార్పిడిలో సాయపడేందుకు ఈ సిగ్నల్స్‌ను భారత్‌లోకి ప్రసారం చేస్తోందని అధికారులు జాతీయ మీడియాకు తెలిపారు. ఇవి జమ్మూ వరకూ చొచ్చుకొస్తున్నట్టు చెప్పారు. ఈ దిశగా నియంత్రణ రేఖకు అత్యంత సమీపంలో వ్యూహాత్మక ప్రాంతాల్లో పాక్ సెల్ టవర్స్‌ను ఏర్పాటు చేసుకుంది. వీటి ద్వారా ప్రసారమయ్యే సిగ్నల్స్ జమ్మూలోని జైళ్ల వరకూ చేరుతున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. కశ్మీర్‌లోని పర్వత ప్రాంతాలు ఈ సిగ్నల్స్‌ను అడ్డుకుంటున్నప్పటికీ జమ్మూ మైదాన ప్రాంతాల మీదుగా ఎలాంటి ఆటంకాలు లేకుండా ఈ సిగ్నల్స్ భారత్‌లోకి చొచ్చుకొస్తున్నాయి. ఈ టవర్స్‌లో ప్రామాణిక జీఎస్ఎమ్

2లో

# యువ క్రీడాకారులకు

## స్ఫూర్తి సాత్విక్-చిరాగ్: సీఎం చంద్రబాబు



అమరావతి, మే 31 (క్రైమ్ కౌంటర్ న్యూస్): సింగపూర్ బ్యాడ్మింటన్ ఓపెన్ 2026 పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్న భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి – చిరాగ్ శెట్టిలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు స్పందించారు. భారత బ్యాడ్మింటన్‌కు మరో చారిత్రాత్మక విజయాన్ని అందించిన ఈ స్టార్ జంట దేశానికి గర్వకారణంగా నిలిచిందని వ్యాఖ్యానించారు. సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ ప్రపంచ వేదికపై భారత్‌కు మరోసారి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చాయని.. వారి అద్భుత ప్రతిభ, అచంచల పట్టుదల, నిరంతర కృషికి ఈ విజయం నిదర్శనమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి విజయంపై ప్రత్యేకంగా గర్విస్తున్నామని సీఎం వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయిలో ఆయన సాధిస్తున్న విజయాలు రాష్ట్ర యువతకు, క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని కొనియాడారు. భారత బ్యాడ్మింటన్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్న ఈ జోడీ భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. దేశం కోసం మరిన్ని పతకాలు, టైటిళ్లు సాధించి భారత క్రీడా చరిత్రలో కొత్త అధ్యాయాలు సృష్టించాలని శుభాకాంక్షలు తెలిపారు.

# అంకితభావంతో పనిచేస్తే

## సామాన్య కార్యకర్త కూడా సీఎం కావచ్చు: డీకే



బెంగళూరు, మే 31 (క్రైమ్ కౌంటర్ న్యూస్):'పార్టీ కోసం ప్రాణం పెట్టి, అంకితభావంతో పనిచేసే ఏ సామాన్య కార్యకర్త అయినా భవిష్యత్తులో ముఖ్యమంత్రి కావచ్చని కర్ణాటక కాంగ్రెస్ అధినేత, కాబోయే ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చెప్పారు. కాంగ్రెస్ శాసనసభా పక్షం నేతగా నిన్న

2లో

# పొగాకు రైతులకు

## న్యాయం జరిగేలా చూస్తాం..



2లో

నెల్లూరు, మే 31 (క్రైమ్ కౌంటర్ న్యూస్): నెల్లూరు జిల్లాలోని పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఏపీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. పొగాకు రైతు ప్రతినిధులతో.. మంత్రి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యలపై మంత్రి ఆనం చర్చించారు. పొగాకు ధరలు గణనీయంగా పడిపోయాయి..

# మెగా డీఎస్సీపై

## మాట్లాడే అర్హత జగన్‌కు లేదు:



ప్రకాశం, మే 31 (క్రైమ్ కౌంటర్ న్యూస్): వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిమినల్ మైండ్ ఉన్న వ్యక్తి జగన్ అని విమర్శించారు. ప్రకాశం జిల్లాలో మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రగతి కోసం మహానాడులో చర్చించామని అన్నారు. మహానాడు విజయవంతంగా జరగడం చూసి

2లో



# జగన్‌పై మంత్రి సవిత ధ్వజం

అమరావతి, మే 31 (క్రైమ్ కౌంటర్ న్యూస్): వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు చంద్రబాబు వస్తే జాబు... జగనొస్తే చావేనని విమర్శించారు. వెలగపూడిలోని సచివాలయం లో మీడియాతో మంత్రి సవిత మాట్లాడారు. మెగా డీఎస్సీలో అక్రమాలకు తావే లేదని స్పష్టం చేశారు. వైసీపీ నేతల బిడ్డలు సైతం డీఎస్సీలో క్వాలిఫై అయ్యి టీచర్లగా పనిచేస్తున్నారని ప్రస్తావించారు. ముఖ్య మంత్రిగా 2 లక్షలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత సీఎం చంద్రబాబుదని వ్యాఖ్యానించారు. జగన్ రెడ్డి ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. టీడీపీ మహానాడులో మహిళా రిజర్వేషన్ల ప్రకటనతో జగన్ మైండ్ బ్లాంక్ అయ్యిందని ఎద్దేవా చేశారు. మెగా డీఎస్సీలో అక్రమాలంటూ జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మంత్రి సవిత ధ్వజమెత్తారు.

# నీ డ్రామాలు ఇక చెల్లవు..



అమరావతి, మే 31 (క్రైమ్ కౌంటర్ న్యూస్): దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని నంద్యాల జిల్లాలో ఓ వ్యక్తి ధ్వంసం చేశాడు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన పోస్టుపెట్టారు. 'హ్యాష్‌ట్యాగ్‌లతో పోస్టు చేశారు. జగన్ రాజకీయ ప్రయోజనాల కోసం వరుస నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రజలు ఇటువంటి రాజకీయ డ్రామాలను తిరస్కరించినప్పటికీ వాటిని కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో జరిగిన కొన్ని సంఘటనలను ప్రస్తావించారు. 'బాబాయి గుండెపోటు, కోడి కత్తి, గులకరాయి నాటకాల రాయుడు జగన్' అంటూ

2లో


గుంటూరు, ప్రకాశం, విజయవాడ, కాకినాడ, అనంతపూర్, కడప ఎడిషన్లతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా
వెలువడుతున్న క్రైం కౌంటర్ దినపత్రికలో వ్యాపార ప్రకటనలకు సంప్రదించండి. 9849707349

## పాక్ కుట్ర.. ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి టెలికం సిగ్నల్స్

టెక్నాలజీకి బదులు సీడీఎమ్ఏ సాంకేతికతను వాడారని భారత అధికారులు చెప్పారు. స్మార్ట్ ఫోన్స్, రేడియో సెట్స్ అనుసంధానించి ఎన్‌క్రిప్టెడ్ విధానంలో సమాచారం పంపించే వైఎస్ఎమ్ఎస్ సర్వీసుకు (చైనా తయారీ వ్యవస్థ) అనువుగా ఈ టవర్స్‌ను పాక్ ఏర్పాటు చేసిందని చెబుతున్నారు. ఫలితంగా భారతీయ సిగ్నల్స్, సిమ్ కార్డుల అవసరం లేకుండానే పాక్ హ్యాండ్లర్లు భారత్‌లోని ఉగ్రవాదులతో సంప్రదింపులు జరుపుతారని చెబుతున్నారు.

అంతర్జాతీయ టెలికం నిబంధనల ప్రకారం, ఒక దేశానికి చెందిన సెల్యులర్ సిగ్నల్స్ సరిహద్దు దాటి 500 మీటర్లకు మించి పొరుగు దేశంలోకి వెళ్లకూడదు. అయితే, భారత్‌లోని కథువా, రాజౌరీ, పూంఛ్ వంటి సరిహద్దు జిల్లాలతో పాటు జమ్మూ నగరానికి ఉత్తరాన 15 కిలోమీటర్ల దూరంలోని కోట్‌బాల్వాల్ జైలు వరకూ పాక్ సిగ్నల్స్ ఆనవాళ్లను గుర్తించామని అధికారులు చెప్పారు. అక్రమ సిగ్నల్స్‌ను అడ్డుకునేందుకు జైళ్ల వద్ద ఉన్న కొన్ని జామర్లు ఈ సిగ్నల్స్‌ను అడ్డుకోలేకపోతున్నాయని అధికారులు తెలిపారు. వీటిని అడ్డుకునే కొత్త తరం జామర్ల అవసరం ఉందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే, 2019-20 పాక్ చేసిన ఇలాంటి ప్రయత్నాలను భారత్ దీటుగా ఎదుర్కొందని చెప్పారు. ప్రస్తుతం పాక్ ప్రయత్నాలకు అదే గతి తప్పదని చెప్పారు.

## సామాన్య కార్యకర్త కూడా సీఎం కావచ్చు: డీకే

ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయన, బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. తన రాజకీయ ప్రయాణం గురించి డీకే శివకుమార్ మాట్లాడుతూ, 'నేను 1979-80 కాలం నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్నాను. ఒక సాధారణ విద్యార్థి నాయకుడిగా నా ప్రస్థానం మొదలైంది. ప్రతి స్కూల్, కాలేజీ నుంచి యువతను, కార్యకర్తలను పార్టీ వైపు నడిపించాను. ఈ రోజు నేను ఈ స్థాయికి రావడం కాంగ్రెస్ శ్రేణులందరికీ సంతోషాన్నిచ్చే విషయం. కష్టపడే గుణం ఉంటే నాలాంటి సామాన్య కార్యకర్త ఎవరైనా సీఎం కావచ్చు' అని కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. మరోవైపు, మూడు సంవత్సరాల పాటు కర్ణాటక ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన డీకే శివకుమార్, జూన్ 3న మధ్యాహ్నం బెంగళూరులోని లోక్ భవన్‌లో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మే 28న సిద్ధరామయ్య స్వచ్ఛందంగా రాజీనామా చేయడంతో, మే 30న శివకుమార్ గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతి కోరుతూ లేఖ సమర్పించిన సంగతి తెలిసిందే.

విరాట్ కోహ్లీ, ఆర్‌సీబీకి డీకే శుభాకాంక్షలు

రాజకీయాలతో పాటు క్రీడలపై తనకున్న ఆసక్తిని డీకే శివకుమార్ చాటుకున్నారు. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ జరుగుతున్న తరుణంలో, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. 'ఈ ఏడాది కూడా విరాట్ కోహ్లీ అద్భుతంగా ఆడారు. కర్ణాటక ప్రజల తరపున, కోట్లాది మంది ఆర్‌సీబీ అభిమానుల తరపున, కర్ణాటక ప్రభుత్వం తరపున నేను అతనికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.' అన్నారు.

## పొగాకు రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పొగాకు రైతు ప్రతినిధులతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని మంత్రి ఆనం వెల్లడించారు. నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు, ఉదయగిరి, కావలి ప్రాంతాల్లో సుమారు 45 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేస్తున్నారని తెలిపారు. దాదాపు 4 వేల రైతు కుటుంబాలు ఈ పంటపై ఆధారపడి జీవిస్తున్నాయని చెప్పుకొచ్చారు. జిల్లాలో 3,600 పొగాకు బ్యారెన్లు ఉన్నాయని తెలిపారు. గత ఏడాది పొగాకు ధర కిలోకు రూ.280 నుంచి రూ.360 వరకు పలికిందని, ప్రస్తుతం డీసీపల్లి, కలిగిరి కొనుగోలు కేంద్రాల్లో కిలోకు కేవలం రూ.190 మాత్రమే వస్తోందని పేర్కొన్నారు. ధరలు గణనీయంగా పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఈ సమస్యను ఇప్పటికే మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, బాలవీరాంజనేయులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి ఆనం తెలిపారు. అంతేకాకుండా కేంద్ర వాణిజ్యశాఖ, ఆర్థికశాఖ మంత్రులతో కూడా సీఎం చర్చించారని అన్నారు. పొగాకు రైతులకు న్యాయం జరిగే వరకు తమ ప్రభుత్వం వారి పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం అవసరమైన చర్యలు తీసుకుంటూ, మార్కెట్ పరిస్థితులను సమీక్షించి తగిన పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

## మెగా డీఎస్సీపై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు:

జగన్ రెడ్డి తట్టుకోలేక పోతున్నారని ధ్వజమెత్తారు. కనీవినీ ఎరగని రీతిలో మహానాడుకి లైవ్‌లో 24 లక్షల మంది హాజరయ్యారని ప్రస్తావించారు.

ప్రపంచంలోనే మహానాడుది ఒక చరిత్ర..

ప్రపంచంలోనే మహానాడుది ఒక చరిత్ర అని కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. మెగా డీఎస్సీ గురించి మాట్లాడే అర్హత జగన్‌కి లేదని చెప్పారు. మెగా డీఎస్సీలో అర్హత సాధించిన వాళ్లు ఏడాది కాలంగా ఉద్యోగాలు చేసుకుంటున్నారని తెలిపారు. జగన్ నేర చరిత్ర, అవినీతి బయటకు వస్తున్నాయని చెప్పారు. ఏపీ లిక్కర్ స్కాం బయటకు వచ్చినప్పుడు ఒకటి, అమరావతి గురించి మాట్లాడితే మావిగన్, మహానాడు జరుగుతుంటే డీఎస్సీ గురించి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

తల్లినీ, చెల్లిని బయటకు గెంటేశారు..

వందల కోట్లు జగన్ పీఏకి ఎలా వచ్చాయని కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని లక్షల కోట్లు దోచుకున్న వ్యక్తి జగన్ అని విమర్శించారు. జైలు జీవితం కూడా అనుభవించిన వ్యక్తి జగన్... ప్రజలు ఈ విషయాలను కూడా గమనించాలని అన్నారు. అవినీతి పార్టీ వైసీపీ అని ఎద్దేవా చేశారు. మహిళలు అంటే జగన్‌కి గౌరవం లేదని అన్నారు. తల్లినీ, చెల్లిని బయటకు గెంటేశారని ఆగ్రహించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు

## నీ డ్రామాలు ఇక చెల్లవు..

విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు వైసీపీ కార్యకర్తలను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన జమ్ములయ్య అనే వ్యక్తి వైసీపీ నేతల అనుచరుడేనని పోలీసులు గుర్తించారని అన్నారు. ఈ ఘటన వెనుక వైసీపీ కుట్ర ఉందని ఆరోపించారు. ఎన్నిసార్లు బహిర్గతమైనా వైసీపీ నాయకత్వం తమ రాజకీయ విధానాన్ని మార్చుకోవడం లేదని విమర్శించారు. అంతేకాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో వైసీపీ అనుసరిస్తున్న విధానాలను 'క్రిమినల్ పాలిటిక్స్'గా అభివర్ణిస్తూ, ప్రజలు వాస్తవాలను గమనించాలని లోకేశ్ పిలుపునిచ్చారు.

## నిరంతర శ్రామికుడు చంద్రన్న పరుచూరి నాగబాబు



**క్రైంకౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు నియోజకవర్గం :** రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్తూ అహర్నిశలు శ్రమిస్తూ నిరంతర శ్రామికుడిగా చంద్రన్న కీర్తి ఎనలేనిదని పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువ నేత పరుచూరి నాగబాబు (నాని) అన్నారు. ఆంధ్రుల రాజధానికి చట్టబద్ధత కల్పించి ఇచ్చిన హామీలన్నీ అమలపరుస్తూ పాలనలో వైవిధ్యం చూపిస్తూ ప్రజల్లో ప్రభుత్వ కీర్తిని చాటుతూ ఇంకా ప్రజలకి ఏదో చేయాలని ఆయన తపన మరవలేనిదని నాగబాబు అన్నారు. 75 సంవత్సరాల వయసులో కూడా ఒక యువ నాయకుడిగా ఆయన పరిపాలన నేటి తరానికి దిక్సూచి లాంటిదని, ప్రపంచం గర్వించదగ్గ గొప్ప రాజకీయ మేధావి చంద్రన్న అని నాని చెప్పారు. రాష్ట్రంలో పేదలని ఆదుకుంటూ వారికి కావలసిన వసతులన్నీ సమకూర్తున్న కూటమి ప్రభుత్వం మరల అధికారంలోకి రావాలని కోరారు.



## చందోలు గ్రామాల్లో నీటి కష్టాలు

**: వారం రోజుల నుండి చందోలు పంచాయతీ కుళాయిల నుంచి నీరు రావటం లేదని అధికారులు స్పందించాలని గ్రామ ప్రజల మనవి**

**ది 31 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** చందోలు గ్రామాల్లో త్రాగు నీటి సమస్య తో వారం రోజుల నుండి చందోలు పంచాయతీ కుళాయిల నుంచి నీరు రావటం లేదని వేసవి కాలం లో దూరపు బంధువుల రాకతో ఇంట్లో ఇబ్బందులు పడుతున్నామని ఈ విషయం లో అధికారులు స్పందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. సామాన్య ప్రజలు నీటి కోసం ఎంతో ఇబ్బంది పడుతున్నారంటూ భగభగ మంటున్న ఎండలకి త్రాగు నీటి కోసం అల్లాడిపోతున్నామంటూ తమ బాధలను పట్టించుకోవాలని పంచాయతీ సెక్రెటరీ స్పెషల్ ఆఫీసర్ మండల అధికారులు స్పందించి వెంటనే మంచి నీటిని సప్లై చేయవలసిందిగా ఆదర్శ గ్రామ అభ్యుదయ కమిటీ మరియు చందోలు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా మక్కెన సాగర్ జన్మదిన వేడుకలు






**క్రైంకౌంటర్ కోటేశ్వరరావు పెద్దకూరపాడు న్యూస్ :** పెదకూరపాడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మక్కెన సాగర్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పెదకూరపాడు మండల పార్టీ ఆధ్వర్యంలో పాటిబండ్ల కారుణ్య వృద్ధాశ్రమంలో వృద్ధులు, నిరాశ్రయుల సమక్షంలో సాగర్ పుట్టినరోజును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును వృద్ధులతో కలసి మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులు పెనుముచ్చు రమేష్, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షురాలు ముంతాజ్ తదితరులు సాగర్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సాగర్ యూత్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేపట్టారు. నియోజకవర్గ కేంద్రం పెదకూరపాడుతోపాటు, స్వగ్రామం గారపాడులో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. నేతలు గంగినేని చిన్న, పాటిబండ్ల రత్తయ్య, ముత్యం బాల, గారపాడు గ్రామ తెదేపా అధ్యక్షులు పొదిల కోటేశ్వరరావు, దాసరి రాంబాబు తదితరులు ఉన్నారు.

# రామ్‌నగర్‌లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

### 27 వాహనాలు స్వాధీనం -మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం: డీఎస్పీ మోయిన్





**చీరాల, మే 31 (క్రైమ్ కౌంటర్):** బాపట్ల జిల్లా, చీరాల పట్టణంలోని రామ్‌నగర్ ప్రాంతంలో ఆదివారం ఉదయం విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్ నేతృత్వంలో ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో చీరాల ×× టౌన్ సీఐ శశికుమార్, ఇంకొల్లు సీఐ రామనాయక్, చీరాల × టౌన్, ×× టౌన్, కారంచేడు, చిన్నగంజాం ఎస్ఐలు, చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం సహా సుమారు 50 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల సందర్భంగా ప్రతి ఇంటిని, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడ నివసిస్తున్న వ్యక్తుల వివరాలు, గుర్తింపు కార్డులు తనిఖీ చేశారు. అలాగే వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు, 2 కార్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా నాటు సారా తయారీకి ఉపయోగించే పాత్రలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎం.డి. మోయిన్ మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్, నాటు సారా వంటి మత్తు పదార్థాల అక్రమ తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉన్నట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా టోల్ ఫ్రీ నంబర్ 112కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## ఏటీబీపీఎల్ టోర్నమెంట్‌కు పెద్దవడుగూరు యువకుడు వంశీ రెడ్డి ఎంపిక,!!




**పెద్దవడుగూరు మే 31 క్రైమ్ కౌంటర్ న్యూస్ రాము రిపోర్టర్** అనంతపురం జిల్లా పెద్దవడుగూరు గ్రామంకు చెందిన యువ కిరణం వంశీ రెడ్డి ప్రతిష్టాత్మకమైన ఆంధ్ర టెన్నిస్ బాల్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌కు అనంతపురం జిల్లా తరపున ఎంపికయ్యారు. చిన్నతనం నుంచే క్రికెట్ పై ఎనలేని మక్కువ, పట్టుదలతో కష్టపడి ఆయన ఈ అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నారు. వంశీ రెడ్డి సాధించిన ఈ విజయం పెద్దవడుగూరు మండలానికే కాకుండా, మొత్తం అనంతపురం జిల్లాకే ఎంతో గర్వకారణంగా నిలిచింది. ఈ లీగ్‌లో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ పెద్దవడుగూరు గ్రామ ప్రజలు, యువకులు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, టోర్నమెంట్‌లో రాణించాలని 'ఆల్ ద బెస్ట్' పలికారు..



## అలుపెరగని పోరాట యోధుడు లోకేష్ అన్న పరుచూరి నాగబాబు

**: క్రైంకౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు నియోజకవర్గం :** రాష్ట్ర విద్యాశాఖ మరియు ఐటీ మంత్రివర్యులు లోకేష్ బాబు అలుపెరగని పోరాట యోధుడని తండ్రి ముఖ్యమంత్రివర్యులు చంద్రన్న బాటలో పయనిస్తూ రాష్ట్రనీ అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నారని పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువ నేత పరుచూరి నాగబాబు అన్నారు . రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో మరియు యువతకు ఉద్యోగ కల్పన దిశగా లోకేష్ బాబు కృషి మరువలేనిదని నాని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి రావడంతోనే 16 వేల టీచర్ పోస్టులు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు . ఇచ్చినా ఏ హామీని తూచా తప్పకుండా నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు చేరువైందని మరోసారి రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని నాని తెలియజేశారు.

## సోమవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) యధావిధిగా జరుగుతుంది : జిల్లా కలెక్టర్

- యధావిధిగా సోమవారం జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక .
- నడవలేని,మంచాలకు పరిమితం అయ్య, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఎవ్వరు కూడా పి జి ఆర్ ఎస్ కు తీసుకురాకండి.
- పి జి ఆర్ ఎస్ కు ద్విచక్ర వాహనాల పై వచ్చే వారికి హెల్మెట్ తప్పని సరి.
- "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" ను జిల్లా ప్రజలు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలి.



**ది 31 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి సోమవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు ఉదయం 9 గంటల నుండి 10 గంటలవరకు గతం లో పి జి ఆర్ ఎస్ కు వచ్చిన అర్జీల పరిష్కరం పై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని, అనంతరం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తప్ప కుండా హాజరు కావాలన్నారు. అర్జీదారులు అందజేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## మాజీ మంత్రివర్యులు గాదె వెంకటరెడ్డి అంతిమ యాత్రలో పాల్గొన్న బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ రాజు



**ది 31 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** ఇంకొల్లు మండలం పావులూరు గ్రామం లో మాజీ మంత్రివర్యులు, పెద్దాయన శ్రీ గాదె వెంకటరెడ్డి గారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం గాదె వెంకటరెడ్డి గారి అంతిమ యాత్రలో బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ బాపట్ల నియోజకవర్గం నాయకులు జిట్టా శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ చింతా కిషోర్, పర్చూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంజి వెంకట రావు, ఇంకొల్లు్రాజా చైర్మన్ కరి శ్రీనివాసరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పాలేరు రామకృష్ణ, ఇంకొల్లు పట్టణ టిడిపి అధ్యక్షులు వలేరు మార్పు, ముస్లిం నాయకులు ఆరిఫా, మస్తాన్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జీ జీ హెచ్) సూపరిండెంట్ గా బాధ్యతలు స్వీకరించిన డా. ఎన్ వి సుందరా చారి




**ది 31 మే 2026. (క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** గుంటూరు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జీ జీ హెచ్) సూపరిండెంట్ గా డా. ఎన్ వి సుందరా చారి బాధ్యతలు స్వీకరించారు. న్యూరాలజీ ప్రధానాధిపతిగా చేసి గుంటూరు మెడికల్ కళాశాల ప్రధానోపాధ్యాయులుగా చేసి నేడు జీ జీ హెచ్ ప్రధాన పరిపాలన అధికారిగా బాధ్యతలు చేపట్టడం గర్వాంగా ఉందని అయన అన్నారు. గుంటూరు మెడికల్ కళాశాలలో చదువుకొని అదే కళాశాల ప్రిన్సిపల్ గా చేసి, దానికి అనుబందంగా వున్న ప్రభుత్వ ఆసుపత్రి పరిపాలన అధికారిగా బాధ్యతలు చేపట్టడం సంతోషం భావిస్తున్నానన్నారు. రాబోయే రోజులలో పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే నా ఆశయం అంతే కాక పేదవాడు ప్రభుత్వం ఆసుపత్రికి ఎలాంటి భయం లేకుండా తనంతట తానే స్వయంగా ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని వెళ్లే విధంగా ముందుకు తీసుకువెళతాను అని అన్నారు. ఎంతటి వారైనా జీ జీ హెచ్ కి వచ్చి వైద్యం చేయించుకోవాలి, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్ళకూడదు ప్రభుత్వం ఆసుపత్రికే వెళ్లాలని ఆశభావం వ్యక్తం చేశారు. ప్రతినిత్యం 5వేల మంది రోగులు వచ్చి చూపించుకుంటున్నారు, దానికి తగినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం సకల సౌకర్యాలు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు

## పద్మాపురం గార్డెన్‌లో ఏడాదిన్నర క్రితం మూలకు చేరిన వైనం




**మే 31 క్రైమ్ కౌంటర్ న్యూస్):** అరకులోయలోని పద్మాపురం బొటానికల్ గార్డెన్ అందాలను తిలకించేందుకు ఏర్పాటు చేసిన టోయ్‌ట్రైన్ మూలకు చేరింది. ఏడాదిన్నరగా సందర్శకులకు అందుబాటులో లేకుండా ఉంది. టోయ్‌ట్రైన్‌లో కూర్చుని గార్డెన్ అందాలను తిలకించాలని భావించిన వృద్ధులు, చిన్నారులకు నిరాశే మిగులుతోంది. పద్మాపురం గార్డెన్ సుమారు 28 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. సుమారు మూడు కిలోమీటర్లు పొడవున గార్డెన్‌లో అంతర్గత రహదారులు ఉన్నాయి. గతంలో టోయ్‌ట్రైన్‌లో సందర్శకులు కూర్చుని గార్డెన్ మొత్తం తిలకించేవారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, బెంగాలీ పర్యాటకులు టోయ్‌ట్రైన్‌లో విహరించేందుకు ఆసక్తి చూపుతుంటారు. అయితే టోయ్‌ట్రైన్ మరమ్మతులకు గురై ఏడాదిన్నర క్రితం మూలకు చేరింది. దీని పెట్టెలు సైతం పాడైపోవడంతో వినియోగంలో లేకుండా ఉంది. ఈ ట్రైన్‌లో ట్రిప్‌నకు 30 మంది ప్రయాణించేవారు. ఒక ట్రిప్‌నకు టికెట్ల రూపంలో రూ.2000 వచ్చేది. పర్యాటక సీజన్‌లో 30 నుంచి 35 ట్రిప్పుల వరకు తిరిగేది. అన్‌సీజన్‌లో కనీసం 5 నుంచి 7 ట్రిప్పులు తిరిగేది. టోయ్‌ట్రైన్ ద్వారా ఆదాయం బాగా వచ్చేది. ప్రస్తుతం ఇది మూలకు చేరడంతో ఆదాయం లేకుండాపోయింది. ఇప్పటికైనా ఐటీడీఏ పీవో స్పందించి టోయ్‌ట్రైన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

## వాసవి కుటుంబ సురక్ష పథకం ద్వారా రూ.5 లక్షల చెక్కు అందజేత





**వేటపాలెం మే 31 (క్రైమ్ కౌంటర్ ): వేటపాలెం:** వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాసవి కుటుంబ సురక్ష పథకం (ఎఖూా) ద్వారా సభ్యుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే కార్యక్రమంలో భాగంగా, వాసవి క్లబ్ వనిత వైష్ణవి వేటపాలెం సభ్యురాలు దివంగత గట్టా సుబ్బరావమ్మ గారి నామినీ గట్టా శ్రీనివాస్‌రావు కి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. సభ్యుడు అనుకోని పరిస్థితుల్లో మరణించినప్పుడు వారి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచే ఉద్దేశంతో వాసవి కుటుంబ సురక్ష పథకాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ చుండూరు గాయత్రి, ×ఎఖీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మరియు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దొగుపర్తి బాలకృష్ణ, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చుండూరు సురేష్, రీజన్ చైర్మన్ పొట్టి శైలజ, క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ కోడూరి రామలింగేశ్వరరావు, వేటపాలెం క్లబ్ అధ్యక్షులు లక్ష్మీ తులసి, నాగాంజనేయులు, శ్రీరామ్ గోవర్ధన్ తదితరులు పాల్గొని చెక్కును నామినీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, వాసవి కుటుంబ సురక్ష పథకం సభ్యుల కుటుంబాలకు భరోసా కల్పించే గొప్ప సంక్షేమ కార్యక్రమమని కొనియాడారు.

## ఘనంగా ఎంపీడీఓ జి.రవికుమార్ ఉద్యోగ విరమణ మహోత్సవం





**క్రైంకౌంటర్ కోటేశ్వరరావు కోసూరు న్యూస్ :** క్రోసూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. రవికుమార్ ఉద్యోగ విరమణ మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈయన పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ నందు వివిధ హోదాలలో 41 సంవత్సరముల పైబడి సేవాలాందించారు. ఉద్యోగ విరమణ సందర్భంగా మండలం ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని మాట్లాడారు. మండలం లో అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో చేపట్టి,తనదైనా ముద్రవేసుకున్నారని వారు పేర్కొన్నారు. ఉత్తమ ఆదర్శ అధికారిగా ఎన్నో అవార్డు లు అందుకున్నరన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎంపీపీ కోటయ్య, జడ్పిటిసి జమీల బేగం, డిప్యూటీ ఎంపీడీవో జి శ్రీనివాసరావు, ఇన్చార్జ్ ఎంపీడీవో రాధా రమణ , ఎస్.కె సుభాని, మండల కార్యదర్శులు ఏ. ఆదినారాయణ, పూర్ణచంద్ర రావు, మండల టిడిపి అధ్యక్షులు మొగల్ జాను , రాష్ట్ర టిడిపి మహిళా అధికార ప్రతినిధి వేగుంట రాణి, టిడిపి నాయకులు నల్లజాల కోటేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు, కాంగ్రెస్ కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు, గారపాటి దాసు, గ్రామ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత కోసం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమమే 'ఆపరేషన్ దండాయన' : పోస్టర్ ను ఆవిష్కరించిన బాపట్ల జిల్లా ఎస్పీ

- మహిళలు, బాలికల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తున్నాం.
- మహిళల భద్రత కోసం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమమే 'ఆపరేషన్ దండాయన'.
- మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణకు, నేరస్తులకు త్వరితగతిన శిక్షలు పడేలా బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.
- నిందితులకు వేగంగా శిక్షలు పడేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.



**ది 31 మే 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** మహిళల భద్రత కోసం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమమే 'ఆపరేషన్ దండాయన' అని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్పీ "ఆపరేషన్ దండాయన" పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు, బాలికల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ, మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణకు, నేరస్తులకు త్వరితగతిన శిక్షలు పడేలా బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పోలీస్ శాఖ చేపట్టిన "ఆపరేషన్ దండాయన" కార్యక్రమాన్ని బాపట్ల జిల్లాలో పకడ్బందీగా అమలు చేయనున్నట్లు తెలిపారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో పోలీస్ శాఖ జీరో టాలరెన్స్ విధానంతో పనిచేస్తోందన్నారు. అత్యాచారాలు, గృహహింస, పోక్సో కేసులు, మహిళలపై వేధింపులు వంటి నేరాల్లో నిందితులకు వేగంగా శిక్షలు పడేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. మహిళల భద్రత కోసం అమలు చేస్తున్న "స్పీడ్ ట్రయల్ మానిటరింగ్" విధానం ద్వారా కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేరస్తులపై చట్టపరమైన చర్యలను మరింత కఠినంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళలకు సంబంధించిన ప్రతి కేసులో సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేసి, 60 రోజుల్లోపు చార్జిషీట్లు దాఖలు చేసి, కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు బదిలీ చేసి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాధిత మహిళలకు అవసరమైన కౌన్సెలింగ్, న్యాయ సహాయం అందించడంతో పాటు నేరస్తులు, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నామన్నారు. వారి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. అలాగే పెండింగ్ కేసులను పునఃసమీక్షించి, ప్రాధాన్యత ఆధారంగా విచారణ పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నైబర్‌హుడ్ వాచ్ విధానాన్ని అమలు చేస్తూ, జియోట్యాగింగ్ ఆధారంగా నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నామన్నారు. మహిళలపై నేరాల నివారణలో ప్రజల అవగాహన కీలకమన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రజా వేదికల ద్వారా చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని శక్తి బృందాలకు సూచించామన్నారు. ఇటీవల కేసుల్లో వచ్చిన తీర్పులను ప్రజలకు తెలియజేస్తూ, నేరస్తుల్లో చట్టంపై భయం కలిగించే చర్యలు చేపట్టాలని ఆదేశించామన్నారు. మహిళలపై నేరాల విషయంలో బాపట్ల జిల్లా పోలీస్ శాఖ వైఖరి స్పష్టంగా ఉందన్నారు. ఎంతటి ప్రభావశీలులైనా చట్టం ముందు అందరూ సమానమేనన్నారు. ప్రతి బాధితురాలికి న్యాయం జరిగే వరకు చర్యలు కొనసాగుతాయన్నారు. మహిళల భద్రత కోసం చేపట్టిన 'ఆపరేషన్ దండాయన' విజయవంతం కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయాక్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ జి. నారాయణ, ఉమెన్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సుబ్బారావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ప్రేమయ్య, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.




# జాతీయ అథ్లెటిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన నాగ రవీంద్ర.

**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట (ప్రతినిధి. జి.ఎం.కె.)–** మే నెల 26 వ తేదీ నుండి మే 28 వరకు పంజాబ్ రాష్ట్రం వారు జమ్మూ ఌ కాశ్మీర్ లో నిర్వహించిన 6వ యూత్ స్పోర్ట్స్ ప్రమోషన్ అసోసియేషన్ నిర్వహించిన నేషనల్ ఛాంపియన్‌షిప్ 200 మీటర్ల రన్నింగ్ లో పల్నాడు జిల్లా, నరసరావుపేట మండలం, గురవాయపాలెం గ్రామంనకు చెందిన దళిత కుటుంబానికి చెందిన జొన్నలగడ్డ నాగ రవీంద్ర గోల్డ్ మెడల్ సాధించి పల్నాడు జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. నాగ రవీంద్ర గతంలో 2025 వ సంవత్సరం జూలై నెలలో నేపాల్ లోని భూటాన్ లో జరిగిన ఐదు దేశాల అంతర్జాతీయ ఛాంపియన్ షిప్ లో కుడా ఇండియా తరుపున 200 మీటర్ల రన్నింగ్ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించాడు. ఇంకా అనేక స్టేట్ గోల్డ్ మెడల్స్ కూడా సాధించారు. ఈ సందర్భంగా నాగ రవీంద్ర మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి ఆర్ధిక ఇబ్బందులను ఎధుర్కొంటూ అనేక ఛాంపియన్‌షిప్ లలో పాల్గొని బంగారు పతకాలు సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. తాను పలు పతకాలు సాధించడానికి తన గురువుల, కుటుంబ సభ్యుల, స్నేహితుల సహకారం ఎంతో ఉందని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# అసభ్య ప్రవర్తన ఆనందం కాదు. అది చట్టరీత్యా నేరం. పరివర్తనే శాశ్వత పరిష్కారం-నరసరావుపేట డీఎస్పీ ఎంహనుమంతరావు.



**క్రైమ్ కౌంటర్: నరసరావుపేట (ప్రతినిధి.జి.ఎం.కె. గాంధీ.)–**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు మహిళా మరియు శిశు భద్రత విభాగం ఐజీపీ బి.రాజకుమారి మార్గదర్శకత్వంలో, పల్నాడు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ బి. కృష్ణారావు సూచనల మేరకు ఆదివారం నరసరావుపేట మహిళా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆపరేషన్ పరివర్తన సదన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో మహిళలు,బాలికల భద్రతను మరింత బలోపేతం చేయడం, లైంగిక నేరాల పునరావృతిని నిరోధించడం,అలాగే నేరాలకు పాల్పడిన వారిలో బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లైంగిక నేరాలకు సంబంధించిన చట్టపరమైన పరిణామాలు, బాధితులపై నేరాల ప్రభావం,సామాజిక బాధ్యత,వ్యక్తిత్వ వికాసం,ఆవేశ నియంత్రణ,నైతిక విలువలు,చట్టాలను గౌరవించే జీవన విధానం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానసిక వైద్యులు,న్యాయ నిపుణులు మరియు పోలీసు అధికారులు ఈ కార్యక్రమం లో పాల్గొని విలువైన సూచనలు,సలహాలు అందించారు. ప్రతి వ్యక్తి మహిళలు మరియు చిన్నారుల గౌరవం,భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడినట్లయితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆపరేషన్ పరివర్తన సదన్ కార్యక్రమం ద్వారా నేరస్తుల లో సానుకూల ఆలోచనా విధానాన్ని



పెంపొందించి వారిని బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో శాంతి, భద్రత,పరస్పర గౌరవాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ గతంలో బాలురు,బాలికలు కలిసి స్వేచ్ఛగా ఆడుకునే వాతావరణం ఉండేదని అయితే ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నారుల భద్రతపై ప్రతి కుటుంబం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. లైంగిక నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు ప్రస్తుతం అత్యంత వేగంగా జరుగుతోందని అరెస్టుల అనంతరం 60 రోజుల లోపు చార్జిషీట్లు దాఖలు చేసి 90 రోజుల లోపు విచారణ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రత్యేక కోర్టుల ఏర్పాటు వలన ఇలాంటి కేసులు ఏడాది లోపే తుది తీర్పుకు వచ్చే అవకాశాలు పెరిగాయని తెలిపారు.

భవిష్యత్తులో మళ్లీ నేరాలకు పాల్పడినట్లయితే రౌడీషీట్లు తెరవబడతాయని హెచ్చరించారు. ఒకరికి పడిన శిక్ష సమాజంలోని ఇతరులకు హెచ్చరికగా, మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొంటూ, ప్రతి ఒక్కరిలో సానుకూల పరివర్తన రావాలని, మీలో వచ్చే మార్పు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ముగింపులో హాజరు అయిన వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట సీనియర్ న్యాయవాది నజీమా,డాక్టర్ సుస్మిత,ఆర్ వి ఆర్ కాలేజీ లెక్చరర్ రాజ్యలక్ష్మి, నరసరావుపేట మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుభాషిని, నరసరావుపేట ఒకటవ పట్టణ సిఐ.ఎస్ కె టి. ఫిరోజ్, నరసరావుపేట రూరల్ సిఐ.ఎం.వి. సుబ్బారావు, దాచేపల్లిసిఐ.రాజేష్,రూరల్ ఎస్ఐ.కిషోర్, ఒకటవ పట్టణ ఎస్ఐ.అరుణ, రెండవ పట్టణ ఎస్ఐ.యష్ణ, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక.

మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లోనూ అర్జీల స్వీకరణ.
1100 కాల్ సెంటర్, ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలి- పల్నాడు ఇంచార్జ్ కలెక్టర్ సంజన సింహ.



**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట (ప్రతినిధి.జి.ఎం.కె.)–** జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్ లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సంజన సింహ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్య గురించి ఖచ్చితమైన మరియు పూర్తి వివరాలతో దరఖాస్తు చేయాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అర్జీని సమర్పించాలన్నారు.?గతంలో ఫిర్యాదు చేసిన వారు తప్పనిసరిగా పాత అర్జీ రసీదు తీసుకురావాలని సూచించారు.?అర్జీలో పేరు,చిరునామా మరియు ఫోన్ నంబర్ స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ఫిర్యాదు స్థితిగతులను తెలుసుకునేందుకుజిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా పీజీఆర్ఎస్ జరుగుతుందని తెలిపారు. ప్రజలు తమ సమీప కేంద్రాల్లో ఫిర్యాదు చేయవచ్చున్నారు. అర్జీదారులు కలెక్టరేట్‌కు రాకుండానే తమ సమస్యలను నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన 1100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించ వచ్చునని కలెక్టర్ సూచించారు. గతంలో ఇచ్చిన అర్జీల స్టేటస్ తెలుసుకోవడానికి మీ కోసం.ఏ పి. గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా అర్జీలను సమర్పించవచ్చునని సూచించారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు సత్వర పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముగ్గురు రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తహసీల్దార్లు కలెక్టరేట్‌లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌కు హాజరై వినతులను స్వీకరిస్తారని తెలిపారు. అలాగే ఆర్డీవో,తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించేందుకు సంబంధిత ఏఓ,డీటీ లు అందుబాటులో ఉంటారని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌కు మండల సర్వేయర్లు,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు,గ్రామ రెవెన్యూ అధికారులు తమకు సంబంధించిన అన్ని రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. రైతులు మరియు ప్రజలు తమ భూసంబంధిత సమస్యలు,రెవెన్యూ సమస్యలను ఈ రెవెన్యూ క్లినిక్ ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# క్రీడల్లో నిజాయతీగా ఆడినవారికి ఉద్యోగాలొస్తాయనడానికి మేమే నిదర్శనం: ఉపాధ్యాయులు

**మే 31 క్రైమ్ కౌంటర్ న్యూస్):**మెగా డీఎస్సీ-2025 నిర్వహణపై వస్తున్న వదంతులను నమ్మవద్దని ప్రజలకు ఉపాధ్యాయులు సూచించారు. ఈ డీఎస్సీ నిర్వహణపై జరుగుతున్న దుష్ప్రచారాలను వారు ఖండించారు. ఈ వదంతులను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం అమరావతిలో మెగా డీఎస్సీ-2025 స్పోర్ట్స్ కోటాలో నియామకం పొందిన ఉపాధ్యాయులు ఒక వీడియో విడుదల చేశారు. వేలాది మంది నిరుద్యోగులు నాలుగైదేళ్లు కష్టపడి చదివితే ఈ అవకాశం వచ్చిందని వారు వివరించారు. తమకు ఏ ఏ క్రీడల్లో ప్రావీణ్యం ఉందో ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సోదాహరణగా వివరించారు. అన్యాయంగా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దంటూ దుష్ప్రచారం చేసేవారికి ఉపాధ్యాయులు హితవు పలికారు. ప్రతిభ చూపిన వారికి ఈ డీఎస్సీలో న్యాయం జరిగిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అవాస్తవాలను ఖండించేందుకు తమ వంతుగా ముందుకొచ్చామని ఉపాధ్యాయులు వివరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మద్దతు గత ప్రభుత్వం తమకు ఇవ్వలేదన్న టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ఆడిన తమకు ఈ ఉద్యోగాలు వచ్చాయని స్పష్టం చేశారు. క్రీడల్లో నిజాయతీగా ఆడినవారికి ఉద్యోగాలొస్తాయనడానికి తామే నిదర్శనమని వారు తెలిపారు.

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.

## జర్నలిస్టులు కావలెను

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక గత 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.

APTEL/25/A2843

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

ప్రకాశం సంపుటి : 02 సంచిక : 179 సోమవారం 01- 06 - 2026 పేజిలు : 4 వెల. 2

## రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో
- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349

## శ్రీకాళహస్తి లో రాహు, కేతు పూజలో పాల్గొన్న బైరెడ్డి, దారపనేని





**పామూరు, మే 31, క్రైం కౌంటర్** పంచభూత లింగాలలో ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి వాయు లింగం ను ఆదివారము కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానంలో రాహు, కేతు పూజ అనంతరము జ్ఞాన ప్రసునాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ప్రధాన అర్చకులు స్వామి వారి పట్టు వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. దారపనేని రాజేంద్రప్రసాద్, మిరియం సుబ్బరాయుడు, కౌలూరి ఖాజా రంతుల్లా, జాజం హరికృష్ణ పూజలో పాల్గొన్నారు.

## పొగాకు రైతుల సమస్యపై జూన్ 1 చలో గుంటూరు జయప్రదం చేయండి

**లింగసముద్రం క్రైం కౌంటర్ ప్రతినిధి** పొగాకు పంటకు గిట్టు బాటు ధరకల్పించాలని, జూన్ 1వ తేదీన గుంటూరు ఆర్ఎం దగ్గర జరిగే బోర్డు ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గుడ్లూరు రైతు సంఘం ఆధ్వర్యంలో, లింగసముద్రం మండలం మొగిలిచర్ల గ్రామంలో కరపత్రాల పంపిణీ జరిగింది. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం పొగాకు గిట్టుబాటు ధరలు బాగా పడిపోయాయని దీనివలన రైతులు దివాలా తీశారని, సంఘ నాయకులు ఏం సుభాన్ ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరులో జరిగే ఒక రైతుల సమావేశా నికి, మండలంలోని మండలంలోనీ, ఒక ఒక రైతులంతా ఛలో గుంటూరు కి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు వేముల చిన మాల కొండయ్య, పల్లపోతు ప్రసాద్, ఓ శేఖర్, పల్లపోతు రాముడు రాముడు, బాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రేపు ఉదయం 10 గంటలకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'



**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా....**
సమయంలో మార్పు చేసినట్లు వెల్లడించిన కలెక్టర్ ఎం. విజయ సునీత

మార్కాపురం జిల్లా వ్యాప్తంగా నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో స్వల్ప మార్పులు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఒక ప్రకటనలో తెలిపారు.

సోమవారం (జూన్ 1) నిర్వహించబోయే ఈ కార్యక్రమ సమయాన్ని మార్చినట్లు ఆమె పేర్కొన్నారు.సాధారణంగా జరిగే సమయం కాకుండా, సోమవారం ఉదయం 10:00 గంటల నుంచే ఈ వేదిక ప్రారంభమై, మధ్యాహ్నం 1:00 గంట వరకు కొనసాగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, అర్జీదారులు ఈ సమయ మార్పును గమనించాలని ఆమె కోరారు.జిల్లా ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా అర్జీల రూపంలో రాసుకుని వచ్చి అందజేయాలని కలెక్టర్ సూచించారు...

## ఇంటీరియర్ డిజైన్‌లో పట్టా దామచర్ల తనూజ లక్ష్మి



**ఒంగోలుక్రైం కౌంటర్ ఇచ్చిన**,శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు చిన్న కుమార్తె దామచర్ల తనూజ లక్ష్మి అమెరికా లోని ప్రముఖ విశ్వవిద్యాలయం లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఇంటీరియర్ డిజైన్‌లో మ్యాగ్నా కమ్ లాడ్ గౌరవాలతో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ డిగ్రీని పూర్తి చేశారు. ఈసందర్భంగా గ్రాడ్యుయేషన్ ఫంక్షన్ లో పట్టా తీసుకున్న నేపథ్యంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు దామచర్ల నాగ సత్యలత దామచర్ల అనిషా లక్ష్మి శుభాకాంక్షలనుతెలియజేశారు.

## పోలీసుల హెచ్చరిక ! ఎస్ ఐ శివ నాగరాజు



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,**
ప్రజల భద్రత, ప్రశాంతత కోసం పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారనీ పట్టణ ఎస్ ఐ శివ నాగరాజు తెలిపారు. రాత్రి 11:30 గంటల తర్వాత అత్యవసర పరిస్థితులు, వైద్య అవసరాలు మినహా ఎవరూ అనవసరంగా బయట సంచరించవద్దనీ చెప్పారు. త్రిబుల్ రైడింగ్, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, అనుమానాస్పదంగా సంచరించడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.ఒక్కరి నిర్లక్ష్యం కుటుంబానికి ఇబ్బంది సమాజానికి ప్రమాదంనియమాలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని చెప్పారు.

## ప్రభుత్వ బడుల్లో వంద శాతం ప్రవేశాలే లక్ష్యం

**క్రైం కౌంటర్ న్యూస్,మే 31:**జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రానున్న విద్యా సంవత్సరంలో వంద శాతం ప్రవేశాల లక్ష్యాన్ని సాధించాలి. ఇందుకోసం అధికారులు, ఉపాధ్యాయులు సరికొత్త వ్యూహాలతో, సానుకూల దృక్పథంతో, సమన్వయంతో పనిచేయాల'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎంఈవోలు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ 'జిల్లాలో బడి పిలుస్తోంది కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. లక్ష్యాలను సాధించి, విజయవంతం చేయాలి. నాణ్యమైన విద్యతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి. ఐదేళ్లు నిండిన పిల్లలను 1వ తరగతిలో చేర్పించడంలో బూర్జ, లక్ష్మీనర్సుపేట, మెళియాపుట్టి, సంతబొమ్మాళి, సారవకోట మండలాలు నిర్దేశిత లక్ష్యాలను అధిగమించడం హర్షణీయమ'ని తెలిపారు. ఉన్నత తరగతుల నమోదులో జిల్లా సగటు అత్యంత మెరుగ్గా ఉందన్నారు. లావేరు, పలాస, బూర్జ మండలాలు ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. మిగిలిన మండలాలు కూడా ఇదే స్ఫూర్తితో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న ఆధునిక సౌకర్యాలు, 'లీప్' కార్యక్రమం ద్వారా అందిస్తున్న విద్యా ప్రమాణాలపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేలా పర్యవేక్షించాలని తెలిపారు. సమావేశంలో డీఈవో ఏ.రవిబాబు, జిల్లా విద్యాశాఖాధికారులు, సమగ్రశిక్ష ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం మిల్లర్ల మాయాజాలం..!



**క్రైం కౌంటర్ న్యూస్,మే 31:** ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఓ రైస్ మిల్లుకు కేటాయిస్తే ఆ ధాన్యం బ్లాక్ లిస్టులో ఉన్న మరో మిల్లుకు చేరుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ధాన్యం స్వీకరించే అర్హత లేని మిల్లులకు ఐకేపీలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి కీలక పాత్ర పోషిస్తుండడం ఎల్లారెడ్డిపేట మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఆదివారం మండల కేంద్రంతో పాటు పోతిరెడ్డిపల్లి, వెంకటాపూర్, బొప్పాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మండలంలోని ఓ రైస్ మిల్లుకు కేటాయించారు. లారీల్లో ధాన్యం ఆ మిల్లుకు చేరుకోకముందే ఐకేపీలో విధులు నిర్వ హిస్తున్న ఓ అధికారి తన బినామీ పేరిట గతంలో బ్లాక్ లిస్టులో ఉన్న మండలంలోని రెండు రైస్ మిల్లులకు తరలించుకుపోయారు. సుమారు 10 లారీల ధాన్యాన్ని దర్జాగా హమాలీలతో దిగుమతి చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనతో పాటు ధాన్యం నిర్వహణలో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బ్లాక్ లిస్టులో ఉన్న మిల్లులు గతంలో కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) బకాయిలు, నిబంధనల ఉల్లంఘనలతో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసిన అధికారులు ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. ఆ మిల్లులకు ప్రస్తుతం ధాన్యాన్ని కేటాయించడం లేదు. భారీస్థాయిలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిల నుంచి తప్పించుకునేందుకు చాకచక్యంగా ఓ అధికారి లారీల ధాన్యాన్ని బ్లాక్ లిస్టులోని మిల్లులకు తరలించడంలో ప్రధానపాత్ర పోషించారు. వేలాది టన్నుల ధాన్యం ఇప్పటికే తమ మిల్లుల్లో నిల్వ చేశారని సమాచారం. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో రికార్డులు పరిశీలిస్తే బ్లాక్ లిస్టులోని మిల్లు లో నిల్వ ఉన్న ధాన్యం బయటపడే అవకాశాలున్నాయని పలువురు రైస్ మిల్లర్లు పేర్కొన్నారు. అక్రమంగా తరలించిన ధాన్యం మాయాజాలంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై అద నపు కలెక్టర్ గడ్డం నగేశ్‌ను వివరణగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఓ మిల్లుకు కేటాయిస్తే.. బ్లాక్ లిస్టులో ఉన్న రైస్‌మిల్లుకు ధాన్యం తరలించిన ట్లు తమ దృష్టికి రాలేదని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్య లు తీసుకుంటామని వివరించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి మిల్లర్లు ధాన్యం తరలించి బ్లాక్ లిస్టులో ఉన్న మిల్లుల్లో దిగుమతి చేస్తే కేసులు నమోదు చేస్తామని అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్ వివరించారు.

## శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణాతరగతులు



**ఒంగోలు క్రైశీ కౌంటర్ ప్రతినిధి** నగరం లోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చిన్మయ మిషన్ తోడ్పాటుతో శ్రీగిరి గో క్షేత్ర భవన్ లో ఆదివారం జరిగిన శ్రీగిరి చిన్మయ బాలవిహార్ శిక్షణా తరగతులలో చిన్నారుల నోట వేమన పద్యాలు శ్రావ్యంగా వినిపించాయి. విద్యార్థులు వేమన పద్యాలను భావ సహితంగా అప్పగించారు. శ్రీగిరి బాలవిహార్ శిక్షణా తరగతులకు హాజరయ్య విద్యార్థులకు తెలుగు సాహిత్యంలోని పలువురు ప్రముఖ కవుల పద్యాలను నేర్పడంతో పాటు సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన అవగాహనను పెంపొందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణా తరగతులు ఫల ప్రదంగా సాగుతున్నా యి,

మరిన్ని వినూత్న అంశాలను విద్యార్థులకు నేర్పే కృషిలో నిర్వాహకులు నిమగ్నమై ఉన్నారు. చిన్నారులకు ఇంటి వద్ద కూడా పద్యాలను నేర్పిస్తున్న తల్లిదండ్రులను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్, ఆలూరు జయశంకర్, శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రతినిధులు అభినందించారు.ఎస్ పద్మావతి పర్యవేక్షించారు.

## శ్రీకృష్ణునికిమామిడికాయలతో అలంకారం



**క్రైం కౌంటర్ ప్రతినిధి కందుకూరు టౌన్,**శ్రీకృష్ణ జన్మస్థలం (ఉత్తరప్రదేశ్) మథుర శ్రీ కృష్ణ ఆలయం నందు ఉలవపాడు బంగినపల్లి మామిడి పండ్ల తో ఈ రోజు అలంకరణ చేశారు. కందుకూరు నియోజకవర్గం లో ఉన్న ఉలవపాడు మామిడిపళ్ళకు దేశవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి ఉంది. నిజంగా ఇది కందుకూరు నియోజకవర్గానికి, ఉలవపాడుకు అదృష్టంగా భావించవచ్చు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే ఆటోమేటిక్‌గా చలాన్ జారీ

**క్రైం కౌంటర్ న్యూస్,మే 31:** శాఖపట్నంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహకారంతో ట్రాఫిక్ నిర్వహించాలని ఎంతోకాలంగా పోలీసులు చేస్తున్న యత్నాలకు ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుకు సిస్టమేటిక్ ఆగ్మెంటెడ్ రేడియల్ ట్రాఫిక్ అండ్ హూప్ ఇండక్షన్ (ఎస్ఏఆర్‌టీహెచ్ఐ) అని నామకరణం చేశారు. దీనికి రూ.99.19 కోట్లు అవసరమని లెక్క తేల్చారు. ఇందులో 60 శాతం రూ.49.54 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది. రూ.20 కోట్లు సమకూర్చాల్సిందిగా వీఎంఆర్‌డీఏకు సూచించింది. మిగిలిన మొత్తాన్ని, ఐదేళ్ల నిర్వహణ నిధులను జీవీఎంసీ పెట్టుకోవాలని పేర్కొంది. అంతేకాకుండా ఈ విధానంలో జారీచేసే చలాన్ల వసూళ్ల ద్వారా వచ్చే మొత్తాన్ని ఉపయోగించుకోవాలని సూచించింది.

ఎస్ఏఆర్‌టీహెచ్ఐకు ఒక కమిటీని ఏర్పాటుచేస్తారు. ఈ కమిటీలో పోలీస్, జీవీఎంసీ, రవాణా, ఆర్టీసీ అధికారులు ఉంటారు. ప్రాజెక్టు పనులను కలెక్టర్ ప్రతి మూడు నెలలకొకసారి సమీక్షించాలని సూచించింది. అంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చేయడానికి, ట్రాఫిక్‌ను సాఫీగా నడపడానికి, ప్రమాదాలను తగ్గించడానికి, భద్రత కోసం ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు.

ఏమి చేస్తారంటే...? నగరంలో అన్ని జంక్షన్లలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. వాటిని ఏఐ పరిజ్ఞానాన్ని అనుసంధానం చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కలుపుతారు. అక్కడి నుంచి అన్నీ పరిశీలిస్తారు. సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా బండి నడపడం, బెల్ట్ పెట్టుకోకుండా కారు డ్రైవ్ చేయడం, సరైన నంబరు ప్లేటు లేకుండా వెళ్లడం వంటి ఉల్లంఘలన్నింటినీ ఈ కెమెరాలు ఫొటోలు తీసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు పంపుతాయి. అక్కడి నుంచి చలాన్లు జారీ అవుతాయి. జరిమానా వేస్తారు. ఎక్కడైనా ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటే దాన్ని క్లియర్ చేయడానికి సూచనలు చేస్తారు. సిబ్బందిని పంపుతారు.

సిటీలో 101 ట్రాఫిక్ జంక్షన్లలో ఈ సాంకేతికతతో కూడిన సీసీ టీవీ కెమెరాలు పెడతారు. ప్రధానంగా నిబంధనలు ఉల్లంఘించే 90 జంక్షన్లు గుర్తించి వాటిపై దృష్టిసారిస్తారు. ట్రాఫిక్ సాఫీగా సాగిపోయే 14 జంక్షన్లు గుర్తించారు. వాటిపై మానటరింగ్ ఉంటుంది. సిటీలో మొత్తం 131.80 కి.మీ. పొడవున ఈ ఏఐ నిఘా ఉంటుంది. పాదచారుల భద్రతకు 12 ప్రాంతాలు గుర్తించారు. ఈ ప్రాజెక్టును జీవీఎంసీ అమలు చేస్తుంది.

# మార్కాపురం రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో సదుపాయాల కొరత - ప్రయాణికుల ఆగ్రహం













**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా....**మార్కాపురం రైల్వే స్టేషన్‌లో టూ-వీలర్ పార్కింగ్ నిర్వహణపై ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తమ వాహనాలను పార్కింగ్‌లో ఉంచాల్సి వస్తున్నప్పటికీ, వసూలు చేస్తున్న ఫీజులకు తగిన భద్రతా, రక్షణ సదుపాయాలు లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ ప్రాంతంలో షెడ్లు లేకపోవడంతో వాహనాలు ఎండలు, వానలకు నేరుగా గురవుతున్నాయి. అలాగే సీసీ కెమెరాలు, భద్రతా గేట్లు వంటి కనీస భద్రతా చర్యలు కూడా కనిపించకపోవడంతో వాహనాల భద్రతపై ప్రయాణికుల్లో ఆందోళన నెలకొంది. ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ సరైన సేవలు అందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. "మేము డబ్బులు చెల్లిస్తున్నాం కానీ మా వాహనాలకు ఎలాంటి రక్షణ లేదు. తిరిగి వచ్చేసరికి వాహనం సురక్షితంగా ఉంటుందో లేదో అన్న భయం వెంటాడుతోంది" అని ప్రయాణికులు వాపోతున్నారు. పార్కింగ్ సిబ్బంది నుంచి కూడా సరైన స్పందన లేకపోవడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోందని పేర్కొంటున్నారు. ఈ సమస్యలపై పర్యవేక్షణ వహించాల్సిన రైల్వే అధికారులు స్పందించాలని, పార్కింగ్ ప్రాంతంలో షెడ్లు, సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది, గేట్లు వంటి మౌలిక సదుపాయాలు వెంటనే ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల నుంచి ఫీజులు వసూలు చేస్తున్న నేపథ్యంలో పార్కింగ్ యాజమాన్యం నాణ్యమైన సేవలు అందించే బాధ్యతను నిర్వర్తించాలని కోరుతున్నారు......

# ప్రతి ఇంటిలో జనాభాను నమోదు చేసుకున్న ఎన్యూమరేటర్లు

**క్రైం కౌంటర్ న్యూస్,మే 31:**జిల్లాలో జనాభా పెరుగు తుందని అంతా భావించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నిర్వహిస్తున్న లెక్కల్లో పదిశాతమైనా జిల్లా నుంచి పెరుగుదల సాధ్యమవు తుందని ఆశించారు.కానీ అధికారులు లెక్కలు తల్లకిందుల య్యాయి. జనాభా పెరుగుదల మాటలా ఉంచితే తగ్గినట్టు తేలడంతో అంతా ఉలిక్కిపడ్డారు. కారణాలేమిటనేది తెలియ రావడం లేదు. క్షేత్రస్థాయిలో మళ్లీ సర్వే నిర్వహించి లెక్కలు తేల్చేందుకు సిద్ధమవుతున్నారు.

గతంలో ఏటా జనాభా పెరుగుదల నమోదయ్యేది.. ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగే జనగణన ఆధారంగా ఈ విషయం తెలిసేది. 2011 తర్వాత ఇటీవల చేపట్టిన గృహ గణన సర్వే వివరాలు విస్మయం కలిగిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 20 మండలాలు, 6 మునిసిపాల్టీల్లో సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లాలో హెచ్‌ఎల్‌బీఎస్‌లు 3,486 ఉన్నాయి. ప్రతీ ఎన్యూమరేటర్‌కు 300 ఇళ్లు సర్వే చేపట్టేలా నిర్ణయించారు. గృహ గణనతో పాటు, జనాభా సంఖ్య తేల్చేందుకు జిల్లాలో పక్కా ప్రణాళికతో వెళ్లారు. జనాభా తగ్గుదల నమోదు కావడంతో మరోసారి పునఃపరిశీలిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుదల లేనట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. నిజానికి ఈ నెల ఒకటో తేదీ నుంచి జిల్లాలో గృహగణన ప్రారంభించారు. ఈ నెలాఖరుతో ముగియనుంది. ఇప్పటి వరకు జరిగిన సర్వే ఆధారంగా వచ్చిన ఫీడ్ బ్యాక్‌ను చూసి అధికారులు కంగుతింటున్నారు. నమోదైన జనాభాలో గతంలో కంటే తగ్గుదల కనిపించింది.

51,362 మంది తగ్గారు

దేశవ్యాప్తంగా 2011లో జనాభా లెక్కలు నిర్వహించారు. జిల్లాలోని మండలాల పరిధిలో అప్పటి లెక్కల ప్రకారం 18,45,029 మంది జనాభా ఉన్నారు.. 2026 సంవత్సరంలో ఈ నెలలో నిర్వహించిన గృహ గణనలో భాగంగా ఇంట్లో ఎంతమంది ఉన్నారనే వివరాలు సేకరించారు. ఆ లెక్కల ప్రకారం 17,93,667 మంది ఉన్నట్లుగా లెక్క తేలింది. దీని ప్రకారం ఈ 15 ఏళ్లలో 51,362 మంది తగ్గినట్టుగా తెలుస్తోంది.గ్రామీణ ప్రాంతాలు ఎక్కువుగా ఉన్న ఇతర జిల్లాల్లోనూ ఇలాంటి పరిస్థితే కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. వాస్తవంగా 15 సంవత్సరాల తరువాత జనాభా పెరగాలని కానీ తగ్గటంతో అధికారులు ఆశ్చర్య పోతున్నారు. తేడా ఎందుకు వచ్చిందనే విషయంపై ఆరా తీస్తున్నారు. ఎన్యూమరేటర్లతో సమావేశం నిర్వహించి వివరాలు



తెలుసుకుంటున్నారు.ఇప్పటికే 99.95 శాతం గృహ గణన సర్వే పూర్తి అయిపోయింది. మిగిలిన 1 శాతం వచ్చినా అనుకున్నంత జనాభా పెరగదనే అంచనాకు వచ్చేశారు. దీంతో మరోసారి సర్వే చేయించాలని భావిస్తున్నారు.

ఎందికిలా ?

గృహగణన సర్వేలో భాగంగా అద్దెకు ఉంటున్నారని వదిలి వేయడం వల్ల సంఖ్య తగ్గిందనే అభిప్రాయపడు తున్నారు. మరోవైపు ఇతర రాష్ట్రాల వారు ఇక్కడ ఉద్యోగ రీత్యా నివాసం ఉంటున్నారు. వారంతా తమ సొంత రాష్ట్రంలో జనాభా నమోదు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. మరో వైపు గడిచిన 15 సంవత్స రాల కాలంలో జిల్లా నుంచి హైదరాబాద్, చెన్నయ్, విశాఖ వంటి ప్రాంతాలకు ఉద్యోగ, వ్యాపార రీత్యా తరలివెళ్లారు. వారంతా అక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారూ ఉన్నారు. వారంతా ఇప్పటికీ తమ సొంత రాష్ట్రంలోనే ఉండేలా ఎన్యూమరేటర్‌లకు వివరించారు. అదేవిధంగా డోర్ లాక్‌లు కూడా ఎక్కువగా ఉన్నాయి. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టడంతో డోర్ లాక్‌ల సంఖ్య తగ్గింది. ఆదివారంతో సర్వే గడువు ముగియనుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అద్దెకు ఉన్నాసరే నమోదు చేయాల్సిందేని అధికారులు సూచించారు. ఆ మేరకు మరోసారి సర్వే నిర్వహిస్తే జనాభా పెరుగుతుందని ఆశిస్తున్నారు.

# కేంద్ర, రాష్ట్ర అధికారుల సమష్టి కృషి, సమన్వయం, సరైన ప్రణాళిక ద్వారానే సాధ్యం




**క్రైం కౌంటర్ న్యూస్,మే 31:**విశాఖను ప్రపంచశ్రేణి నగరంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఎంపీ ఎం.శ్రీభరత్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్ హోదాలో ఆయన మాట్లాడుతూ సమష్టి కృషి, సరైన ప్రణాళిక ద్వారానే నగరానికి ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. మౌలిక సదుపాయాలు, మెరుగైన తాగునీటి వ్యవస్థ, సమర్థవంతమైన మురుగునీటి నిర్వహణ, పర్యావరణ రక్షణ, అండర్‌గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థ, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై దృష్టిసారించాలన్నారు. కేంద్రం ప్రకటించిన రూ.50 వేల కోట్ల అర్బన్ ఛాలెంజడ్ ఫండ్‌లో విశాఖపట్నానికి రూ.1,500 కోట్లు విలువైన మూడు ప్రాజెక్టులు మంజూరుకావడం సంతోషంగా ఉందని పేర్కొంటూ జీవీఎంసీ అధికారులకు అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో అధికార యంత్రాంగం పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. జలధార–జలహారతి ద్వారా తాగునీటి సంరక్షణ జరగాలని, ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు అర్హులకు అందాలని, ఉల్లాస్ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు శతశాతం అక్షరాస్యత సాధించాలని అన్నారు. నూతన లేబర్ కోడ్‌లపై వాణిజ్య సంస్థల యాజమాన్యాలకు ఏర్పాటుచేసే అవగాహన శిబిరాల్లో తాను, కలెక్టర్ పాల్గొంటామన్నారు. పేదలకు గృహాలు మంజూరుచేయాలని, రైతులు పండించే పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని, విద్యాశాఖలో ఉత్తమ విధానాలు అమలు చేయాలని శ్రీభరత్ ఆదేశించారు. నగరంలో అమ్ముతున్న చికెన్, మటన్ నాణ్యతపై అధికారులు దృష్టిసారించాలని, ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి గ్రేడింగ్ ఇవ్వాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాలపై ప్రభావం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పథకాల అమలుకు కార్యాచరణ రూపొందించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని, సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ మల్కాపురంలోని అచ్చెన్నాయుడులోవలో నిర్మించిన టిడ్కో ఇళ్ల కాలనీలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడ్కో, రాజీవ్ గృహకల్ప కింద నిర్మించిన కాలనీల్లో లబ్ధిదారులు లేక ఇళ్లు ఖాళీగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని జీవీఎంసీ యూసీడీ, గృహ నిర్మాణ సంస్థ అధికారులకు ఆదేశించారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల కోసం డీడీలు కట్టి బ్యాంకు రుణాలు చెల్లిస్తున్న లబ్ధిదారులకు ఇంతవరకూ ఇళ్లు కేటాయించకపోడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. సమీక్షలో దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శాంతినగర్‌లో అధికారుల మాయాజాలం

**క్రైం కౌంటర్ న్యూస్,మే 31:**నగరపాలక సంస్థలో మాస్టర్ ప్లాన్ రోడ్లపై అధికారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్త మవుతున్నాయి. స్థానికుల అభ్యంత రాలు, సూచనలతో పనిలేకుండానే ఇష్టారాజ్యంగా రోడ్ల ప్లాన్‌లలో మార్పులు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.శాంతినగర్‌లో దాదాపుగా 14 రోడ్లు ఉన్నాయి. ఇక్కడ కలెక్టరేట్ వెనుక భాగంలో ఏలూరు–– నూజివీడు రోడ్డు 80 అడుగుల రోడ్డుగా మాస్టర్ ప్లాన్‌లో నమోదైంది. అయితే ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డును 60 అడుగులకు కుదించి ఇక్కడ రూ.2 కోట్ల పైబడి వ్యయంతో అభివృద్ధి చేసి దాదాపుగా ఎనిమిది నెలలు కావస్తోంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా కూడా విస్తరణ అవకాశం లేకుండా చేశారు. రెండేళ్ల క్రితం శాంతినగర్‌లో 2,3 రోడ్ల మధ్య ఒక బహుళ అంతస్తు భవనం నిర్మాణం ప్రారంభమైంది. దీనిపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కమర్షియల్ జోన్ కాకపోయినప్ప టికీ ఈ భవనం ఎందుకు నిర్మించడానికి అను మతించారంటూ కోర్టుకెక్కడంతో.. ఇక్కడ ఆ భవన నిర్మాణం నిలుపుదలకు కోర్టు స్టే ఇచ్చింది. తాజా గా ఇటీవల రెండో రోడ్డును మాస్టర్ ప్లాన్‌లో 30 అడుగులు ఉన్న దాన్ని అకస్మాత్తుగా 60 అడు గులు పెంపు చేసే ఆవశ్యకత ఎందుకొచ్చిందన్న విమర్శలు రేగుతున్నాయి. దీనిని విస్తరించడం వెనుక ఎవరు చక్రం తిప్పారన్న చర్చ సాగుతోంది. ఈ భవన నిర్మాణం చేస్తున్న వ్యక్తికి వ్యాపార పరంగా లబ్ధి చేకూర్చేందుకే జరిగిందన్న విమర్శలున్నాయి. మాస్టర్ ప్లాన్ రోడ్డు మార్పుపై స్థానిక 21వ డివిజన్ కార్పొరేటర్‌కు సమాచారం లేకపోవడం కొసమెరుపు. ఇది వాణిజ్యపరమైన భవనాల నిర్మాణానికి అవకాశం లేదు. దీన్ని 60 అడుగుల పెంచడానికి స్థానికులు సుముఖంగా లేరు. ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు ఏమి తీసుకోకుండానే తెర వెనుక మార్పిడి యత్నం జరిగిందని సమాచారం. దీన్ని స్థానికంగా నివాసితులు అడ్డుకోవడంతో వారు శాంతించాక పనులు చక్కబెట్టే యోచనలో ఉన్నట్లు



సమాచారం.

ఏ రోడ్డు చూసినా అధ్వానమే..

శాంతినగర్‌లో మెయిన్ రోడ్డు తప్ప లోపల ఉన్న అంతర్గత రోడ్లన్నీ చాలా అ?ధ్వానంగా ఉంటున్నాయి. వీటిని బాగు చేయండంటూ ప్రజలను మొత్తుకుంటున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రోడ్లపై అతుకులు, గుంతులతో ప్రజలు సతమతం అవుతున్నారు. ఇటువైపుగా రిటైర్డు ఉద్యోగులు, అధికారులు నివాసం ఉంటున్నారు. అక్కడక్కడ విద్యాసంస్థలూ ఉన్నాయి. దీంతో ఇటు రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయినా రోడ్లు బాగు చేయాలన్న శ్రద్ధ లేకపోగా, ఆ బహుళ అంతస్తుల భవనానికి మాస్టర్ ప్లాన్ మార్పుపై స్థానికులు గుర్రుగా ఉన్నారు. దీనిపై ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్‌ను వివరణ కోరగా 'మాస్టర్ ప్లాన్ మార్పు నా దృష్టికి రాలేదు. ఎవరు ఇప్పటి వరకు ప్రస్తావించ'లేదన్నారు.

# పెందుర్తిలో రెచ్చిపోతున్న అక్రమార్కులు

**క్రైం కౌంటర్ న్యూస్,మే 31:** పెందుర్తి రెవెన్యూ పరిధిలోని చెరువులను కబ్జాదారులు చెర పడుతున్నారు. చెరువు స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు నిర్మించి దర్జాగా విక్రయించేస్తున్నారు. మరికొందరు ప్లాట్లుగా విభజించి అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారు. జల వనరుల సంరక్షణ చట్టాన్ని సవాల్ చేసి మరీ చెరువులను పరాధీనం చేస్తున్నారు.

పెందుర్తి సర్వే నంబరు 230లోని 20 ఎకరాల విస్తీర్ణమున్న గోకాడచెరువు ఆక్రమణలతో కుదించుకుపోయింది. కబ్జాదారుల దెబ్బకు చెరువు రూపురేఖలు మారిపోయా యి. పది ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందని రెవెన్యూవర్గాలే చెబుతున్నాయి. ఇప్పటికే చెరువును ఆక్రమిం చి సుమారు 50 ఇళ్ల నిర్మాణాలు జరిగాయని రెవెన్యూ విచారణలో తేలింది. అక్రమార్కులపై కేసులు పెట్టినా ఆక్రమణలు కొనసాగుతునే ఉన్నాయి.

విజయరామసాగర్ కనుమరుగు

పెందుర్తి సర్వే నంబరు 120లో 6.85 ఎకరాల విస్తీర్ణం గల విజయరామసాగర్



చెరువులో సుమారు రెండెకరాలను ఆక్రమించిన ఓ రియల్ వ్యాపారి సుమారు 40 ఇళ్లతో కాలనీని నిర్మించి, విక్రయించేశారు. ఇదే పంథాలో మిగిలిన చెరువు స్థలంలో అక్రమార్కులు పక్కా నిర్మాణాలు చేపట్టారు.

రాజు చెరువుకు ఎసరు

చినముషిడివాడ సర్వే నంబరు 163లో సుమారు 24.86 ఎకరాల విస్తీర్ణం గల రాజు చెరువు కనుమరుగవుతోంది. ఇప్పటికే సుమారు 20 ఎకరాలు ఆక్రమణకు గురైందని రెవెన్యూ అధికారులు తమ విచారణలో తేల్చారు. చినముషిడివాడ నుంచి సుజాతనగర్ వరకు విస్తరించి ఈ చెరువు కనిపించకుండా పోయే పరిస్థితిలో ఉంది. ఓ స్థిరాస్థి వ్యాపారి సమీపంలోని జిరాయితీ స్థలాన్ని కొనుగోలు చేసి, దానికి ఆనుకుని ఉన్న చెరువును ఆక్రమించి మరీ ఇళ్లు నిర్మించి విక్రయించేశాడు. మరో రియల్ వ్యాపారి చెరువు స్థలాన్ని ప్లాట్లుగా విభజించి అమ్మేశాడు. కొంతమంది పేదల ముసుగులో చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఇలా వందల షెడ్ల నిర్మాణాలు జరిగాయని అ?ధికారులు చేపట్టిన సర్వేలో తెలిసింది. తప్పుడు సర్వే నంబర్లు, పత్రాలు, నకిలీ పట్టాలతో చెరువులను దర్జాగా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు.

చినముషిడివాడ సర్వే నంబర్లు 185,186, 189లో గల పది ఎకరాల చెరవులో ఆక్రమణలున్నాయి. తమ్మివానిచెరువు, కృష్ణరాయపురం, లక్ష్మీపురంలోని రాముడు చెరువులు ఆక్రమణలతో కుదించుకుపోయాయి

నోటీసులు జారీచేసినా...

చెరువు ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసినా కబ్జాదారులు తగ్గడం లేదు. మూడేళ్ల క్రితం చెరువు, గెడ్డ, వాగుల్లో ఆక్రమణలపై 40 మందికి రెవెన్యూ సిబ్బంది నోటీసులు జారీచేశారు. ప్రస్తుతం ఇవి వందల సంఖ్యకు చేరాయి. ఆక్రమణలతో బక్కచిక్కిన చెరువులకు వరదలు వస్తే పెందుర్తి మునిగిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రకటించడం చర్చనీయాంశమయింది.

# అంతా సహకరిస్తే మళ్లీ పూర్వ వైభవం

**క్రైం కౌంటర్ న్యూస్,మే 31:**విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు ఓ బ్రాండ్ ఉందని, దానిని అంతా కలిసి నిలబెట్టాలని ఉక్కు ఉద్యోగులకు సీఎండీ ఎంఎన్‌వీఎస్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ప్లాంటును లాభాల్లోకి తీసుకువస్తామని విశ్వాసం వ్యక్తంచేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు శనివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేయగా, సీఎండీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. దాదాపు మూడు దశాబ్దాలు ప్లాంటు కోసం అహర్నిశలూ శ్రమించి పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ చేసినప్పుడు హాజరు కావడం సీఎండీగా తన కనీస బాధ్యత అన్నారు. తాను సూటు, బూటు వేసుకొని ప్రత్యేకంగా ఏమీ లేనని, మీలో ఒకడినేనన్నారు. ప్లాంటు ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉందని, రోజులు బాగా లేవన్నారు. అంతా అండగా ఉండి, సహకారం అందిస్తే ఈ అడ్డంకులన్నీ అధిగమించి ప్లాంటుకు మళ్లీ పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. అప్పుడు 'మీకు నేను జీవితాంతం అండగా ఉంటాను' అని మాట ఇచ్చారు. ఇటీవల కాలంలో ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమానికి సీఎండీ స్థాయి అధికారి ఎప్పుడూ రాలేదు. ఇప్పుడు తెలుగు అధికారి అయిన ప్రభాకర్ హాజరు కావడమే కాకుండా, కష్టాలన్నీ తనకు తెలుసునని, పూర్తి సహకారం అందిస్తామని చెప్పడంతో ఉద్యోగ వర్గాలు హర్షం వ్యక్తంచేశాయి.

# బడ్జెట్ రూ.500 కోట్ల నుంచి దశల వారీగా రూ.వేయి కోట్లకు పెంపు

**క్రైం కౌంటర్ న్యూస్,మే 31:** విశాఖపట్నం రైల్వేస్టేషన్ పునర్నిర్మాణ పనులు ఎట్టకేలకు పుంజుకున్నాయి. ఆరంభ దశలో కాంట్రాక్టర్ల వివాదంతో ఏడాదిన్నర ఆగిపోయిన పనులు ఇటీవల ఊపందుకున్నాయి. సుమారు రూ.500 కోట్ల అంచనాతో ప్రారంభమైన పనులకు దశల వారీగా వేయి కోట్ల వరకు వెచ్చిస్తామని రైల్వే ఉన్నతాధికారులు చెబుతున్నారు.

విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటవుతున్న నేపథ్యంలో అదేస్థాయిలో స్టేషన్ కూడా ఉండాలని అధికారులు ముందుగానే ప్రణాళిక రూపొందించారు. స్టేషన్‌కు కొత్త రూపు తీసుకురావడంతో పాటు అదనపు ప్లాట్‌ఫారాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని డీపీఆర్ తయారు చేసి ఆమోదం పొందారు. దాని ప్రకారం ప్రస్తుతం రైల్వే స్టేషన్‌ను జ్ఞానాపురం వైపు విస్తరిస్తున్నారు. ఇప్పుడు ఎనిమిది ప్లాట్‌ఫారాలు ఉండగా అదనంగా మరో ఆరు నిర్మించనున్నారు. అప్పుడు మొత్తం ప్లాట్‌ఫారాల సంఖ్య 14కు చేరుతుంది. దీంతో మరిన్ని కొత్త రైళు రావడానికి అవకాశం ఉంటుంది. స్టేషన్‌ను 'యు' ఆకారంలో అభివృద్ధి చేస్తున్నారు. దీనివల్ల ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు ప్రయాణికులు వెళ్లడానికి సౌలభ్యంగా ఉంటుంది. కోల్‌కత్తాలో మాదిరిగా షాపింగ్ కోసం ప్రత్యేక నిర్మాణం (కాంకోర్) కూడా ప్లాన్ చేశారు. ప్రస్తుత ప్రవేశ ద్వారం ఉన్న వైపు టెర్మినల్ భవనాన్ని గ్రౌండ్౦2 మోడల్‌లో నిర్మిస్తారు. ఆ తరువాత జి౦5కు విస్తరిస్తారు. అటు జ్ఞానాపురం వైపు రైల్వే రిజర్వేషన్ కాంప్లెక్స్, పార్కింగ్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. మొదట మల్టీలెవెల్ కారు పార్కింగ్ భవనం నిర్మించాలని అనుకున్నారు. కానీ అందుబాటులో భూమి ఉండడంతో ఓపెన్ పార్కింగ్‌కే ప్రాధాన్యం ఇచ్చారు. సుమారుగా 1.5 లక్షల చ.అ. విస్తీర్ణంలో రెండు వేల వాహనాలు (కార్లుంద్విచక్ర వాహనాలు) పట్టేలా కవర్డ్ పార్కింగ్ నిర్మాణం పూర్తిచేశారు. దీనికి ఏఐ టెక్నాలజీ ఆధారిత ప్రవేశం ఏర్పాటుచేసే ఆలోచన ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ పనుల్లో భాగంగా ఆ ప్రాంతంలో ఎర్రిగెడ్డ మళ్లింపు పనులు కూడా చేపట్టారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి అన్ని పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.'వాల్తేరు డివిజన్' పేరు కనుమరుగైపోతోంది. పరిధి తగ్గించుకొని, కేవలం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రాంతాలతో కొత్తగా 'విశాఖపట్నం డివిజన్'గా నామకరణం చేసుకొని దక్షిణ కోస్తా జోన్‌లో ఒకటిగా కొనసాగనున్నది. వాల్తేరు డివిజన్‌కు సరకు రవాణాలో జాతీయ స్థాయి గుర్తింపు ఉంది. అత్యధిక ఆదాయంతో ఐదో స్థానంలో నిలిచేది. ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయింది. అధిక ఆదాయం తెచ్చే కొత్తవలస–కిరండూల్ (కేకే) లైన్ ఒడిశాలోని రాయగడ డివిజన్ పరిధిలోకి వెళ్లిపోయింది. దాంతో ఆదాయం అటు రాయగడ, విశాఖపట్నం డివిజన్లు పంచుకునే పరిస్థితి వచ్చింది. ఈ రెండూ వేర్వేరు జోన్లు. కాబట్టి విశాఖపట్నం కేంద్రంగా ఉండే డివిజన్‌కు ఇకపై సరకు రవాణా ద్వారా ఆ స్థాయి ఆదాయం రాకపోవచ్చు. కానీ కొత్తగా తన ఉనికిని చాటుకుని, ప్రత్యేకతను నిలుపుకొనేందుకు అనేక అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. గతంలో వాల్తేరు డివిజన్ 1,106 కి.మీ. పరిధిలో ఉండగా, అందులో రాయగడ డివిజన్‌కు 541 కి.మీ., ఖుర్దా డివిజన్‌కు 115 కి.మీ. ఇచ్చేసి మిగిలిన 460 కి.మీ.తో విశాఖపట్నం డివిజన్ ఏర్పాటు చేశారు.

# అధ్వానంగా కూడేరు - సింగంపల్లి రోడ్డు


**క్రైం కౌంటర్ న్యూస్,మే 31:**మండలకేంద్రం నుంచి ఆత్మకూ రు మండలంలోని సింగంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా మారింది. మంత్రి వర్యా మీరైనా పట్టించుకోండి అంటూ కూడేరు, సింగంపల్లి గ్రామాల ప్రజలు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను వేడుకుంటున్నారు. కూడేరు నుంచి ఆత్మకూరు మండలంలోని సింగంపల్లికి వెళ్లే రోడ్డు కొన్నేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో కంకర తేలి గుంతలు పడింది. ఆ రోడ్డు మార్గంలో ఉన్న కల్వర్టులు సైతం దెబ్బతిన్నారు. అయితే పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కొన్నేళ్లుగా పరిస్థితి ఇలాగే ఉంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు రోడ్డు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడున్నారు. పాలకులు మారతున్న రోడ్డు దుస్థితి మాత్రం అలాగే ఉందని ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కంకర తేలిన రోడ్డుపై ప్రయాణిస్తున్న సమయంలో వాహనదారులు కింద పడి తీవ్రగాయాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. దీంతో రోడ్డుపై ప్రయాణించాలంటే నరకంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. కూడేరు నుంచి సింగంపలికి వెళ్లాలంటే ఆరు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రోడ్డు పనులు పూర్తి చేస్తే ఆత్మకూరు మండకేంద్రానికి వెళ్లే దూరం కూడా తగ్గిపోతుంది. ఆర్థిక శాఖ మంత్రి పైనే ఆశలు కొన్ని సంవత్సరాలుగా దెబ్బతిన్న కూడేరు– సింగపల్లి రోడ్డుకు బాగుపడాలంటే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పైనే ఆశలు పెట్టుకున్నారు. ఉరవకొండ–రాప్తాడు నియోజక వర్గాల మధ్యనున్న ఈ రోడ్డు ను గత పాలకులు పట్టించుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రధానంగా రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టింది. కావున అధ్వానంగా మారిన కూడేరు – సింగంపల్లి రోడ్డు అభివృద్ధి పనులకు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కరుణించి నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# సినిమా



## ఆయన లేకపోతే నేను ఇంత పెద్ద హీరోయిన్ అయ్యేదాన్ని కాదు..

ఒకప్పుడు తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ విజయశాంతి. అప్పట్లో స్టార్ హీరోలకు మించిన క్రేజ్.. పారితోషికంతో అగ్ర కథానాయికగా ఓ వెలుగు వెలిగింది. మెగాస్టార్ చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్ వంటి స్టార్ హీరోలతో కలిసి ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను అందించారు. సినిమా పరిశ్రమలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు, హీరో ఇమేజ్ తెచ్చుకోవడం చాలా కష్టమని నటి విజయశాంతి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన అనుభవాలను పంచుకున్నారు. ముఖ్యంగా ఒక మహిళగా, హీరోలతో సమానంగా పారితోషికం, గౌరవం సంపాదించుకోవడం మామూలు విషయం కాదని ఆమె పేర్కొన్నారు. యాక్షన్ పాత్రల కోసం మానసికంగా సిద్ధపడటం, శారీరక శ్రమకు అలవాటు పడటం సులభం కాదని విజయశాంతి వివరించారు.యాక్షన్ సన్నివేశాల్లో నటించడం అలవాటు పడటానికి తనకు కొంత సమయం పట్టిందని, తన శరీరాకృతిని, నటన శైలిని ఒక రఫ్ అండ్ టఫ్ హీరో బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా మార్చుకోవాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. మొదటి చిత్రం నుండి క్రమంగా తన ఫైట్స్ మెరుగుపరుచుకుంటూ వెళ్ళానని, అప్పట్లో గ్రాఫిక్స్ లేని కారణంగా ప్రతి సాహసాన్ని ఒరిజినల్‌గానే చేయాల్సి వచ్చేదని గుర్తు చేసుకున్నారు. డూప్ లేకుండా 20-30 అడుగుల ఎత్తు నుండి దూకడం, గన్‌తో షూట్ చేయడం వంటి సన్నివేశాలను ఎంతో కష్టపడి చేశానని ఆమె వెల్లడించారు. ఈ ప్రయత్నాల ద్వారా తాను ఒక యాక్షన్ హీరోయిన్‌గా, హీరోలు మాత్రమే కాకుండా హీరోయిన్లు కూడా ఇలాంటి పాత్రలు చేయగలరని నిరూపించుకోగలిగానని విజయశాంతి అన్నారు.ఈ ప్రయాణంలో దర్శకుడు టి.కృష్ణ (హీరో గోపిచంద్ తండ్రి ) పాత్ర ఎంతో కీలకమని విజయశాంతి కృతజ్ఞతలు తెలిపారు. తనలోని నటనా సామర్థ్యాన్ని "నేటి భారతం" చిత్రం ద్వారా టి.కృష్ణ బయటకు తీసుకువచ్చారని, అప్పటి వరకు కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం అనుకున్న తనను నటనపరంగా నిరూపించుకునే అవకాశం కల్పించారని ఆమె పేర్కొన్నారు. తను కేవలం గ్లామర్ హీరోయిన్ కాదని, నటించగల సామర్థ్యం ఉందని ప్రజలు గుర్తించడానికి టి.కృష్ణ గారే కారణమని ఆమె అన్నారు. విప్లవాత్మకమైన కథలకు, పాత్రలకు తాను సరిపోతానని టి.కృష్ణ గారు బలంగా నమ్మేవారని, తన రాసిన కథలకు విజయశాంతి న్యాయం చేయగలరని ఆయన భావించేవారని ఆమె వివరించారు.అందుకే టి.కృష్ణ తన ప్రతి చిత్రంలోనూ విజయశాంతినే కథానాయికగా తీసుకునేవారని, ఒక సందర్భంలో అన్ని సినిమాల్లో తనే కనిపిస్తున్నానని, వేరొక హీరోయిన్‌ను తీసుకోమని అడిగినా కూడా, "శాంతమ్మ నువ్వే చేయాలి, నువ్వే బాగా చేస్తావు" అని చెప్పేవారని విజయశాంతి పంచుకున్నారు. "ప్రతిఘటన" చిత్రం విషయానికి వస్తే, డేట్స్ కుదరక తాను చేయలేనని చెప్పినా, "నువ్వు చేయకపోతే నేను సినిమా తీయను" అని టి.కృష్ణ పట్టుబట్టారని, చివరికి ఇతర నిర్మాతలందరినీ ఒప్పించి ఒక నెల డేట్స్ తన కోసం కేటాయించారని ఆమె గుర్తు చేసుకున్నారు. విశాఖపట్నం వెళ్లి ఆ సినిమా పూర్తి చేశానని, ఆ సినిమాతోనే తనకు సూపర్‌స్టార్ అనే బిరుదు లభించిందని విజయశాంతి ఎంతో ఆనందంగా తెలిపారు. టి.కృష్ణ ప్రోత్సాహం, ఆయన విశ్వాసం వల్లే తాను ఈ స్థాయికి చేరుకోగలిగానని ఆమె పేర్కొన్నారు.



## ఖర్జూరాలు అంటే మీకు మహా ఇష్టమే..



ఖర్జూరం అనేకమందికి ప్రీతిపాత్రమైన ఆహారం. అయితే, దానిని కొనుగోలు చేసేటప్పుడు గడువు తేదీని తనిఖీ చేయాల్సిన ప్రాముఖ్యతపై అవగాహన ఉండాలి. ఇటీవల గడువు ముగిసిన ఖర్జూరాలను ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు గుర్తిస్తున్న ఘటనలు కూడా చూస్తున్నాం. దీంతో ఖర్జూరం ప్రియులలో కొంత ఆందోళన కలిగించింది. మరి గడువు ముగిసిన ఖర్జూరాన్ని ఎలా గుర్తించాలి? అలాంటి ఖర్జూరం తింటే కలిగే ప్రమాదాలేమిటి? ఖర్జూరం దిగుమతిపై వివరాలు పరిశీలిస్తే, వరల్డ్ బ్యాంక్ వరల్డ్ ఇంటిగ్రేటెడ్ ట్రేడ్ సొల్యూషన్ 2023 డేటా ప్రకారం, ప్రపంచంలోనే అత్యధికంగా ఖర్జూరాన్ని దిగుమతి చేసుకునే దేశం భారత్. ఏటా 2000 కోట్ల రూపాయలకు పైగా విలువైన ఖర్జూరాన్ని భారత్ వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇందులో 45% యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచే వస్తుంది. ఇరాక్, ఇరాన్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఖర్జూరంలో ఉండే తీయదనం, డ్రైనెస్, తేమ వంటి లక్షణాల ఆధారంగా వాటిని వివిధ రకాలుగా విభజిస్తారు.ఖర్జూరాలను ఎంతకాలం సురక్షితంగా నిల్వ చేయవచ్చు లేదా తినవచ్చు అనే దానిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఎటువంటి నిర్దిష్ట సూచనలు చేయలేదు. అయితే, సాధారణంగా ఖర్జూరం స్వభావం, నిల్వ పద్ధతులను బట్టి ఆరు నెలల నుంచి గరిష్టంగా ఒక సంవత్సరం వరకు నిల్వ చేసి తినవచ్చని అధికారులు చెబుతున్నారు. ఖర్జూరం డ్రై ఫ్రూట్స్ కావడంతో, దిగుమతి అయినప్పటి నుంచి ఒక సంవత్సరం వరకు కాలాన్ని లెక్కించి, దాని ప్రకారం ప్యాకింగ్ తేదీ, ఎక్స్పైరీ తేదీని ప్యాకెట్లపై ముద్రిస్తారు. ఈ సమయం కంటే ఎక్కువ కాలం నిల్వ ఉంచితే, అవి సహజంగానే చెడిపోతాయని ఫుడ్ సేఫ్టీ అధికారులు చెబుతున్నారు. అటువంటి ఖర్జూరంలో పురుగులు, ఇతర కీటకాలు పెరిగి, వాటిని తిన్నవారు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఖర్జూరంలోని పోషకాల గురించి పోషకాహార నిపుణులు సైతం కొన్ని సూచనలు ఇస్తున్నారు. ఖర్జూరంలో విటమిన్ బి6, పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్, చక్కెర వంటి పోషకాలు ఉంటాయి. అయితే, గడువు ముగిసిన ఖర్జూరంతో అనేక హానికరమైన ప్రమాదాలున్నాయి. ఖర్జూరాలు చెడిపోయినట్లు సాధారణంగా కంటికి కనిపించకపోవడమే ప్రధాన సమస్య. అధిక వేడి, అధిక తేమ ఉన్న ప్రదేశాలలో ఖర్జూరం వంటి అన్ని సహజ ఆహార పదార్థాలకు బూజు పడుతుంది. ఇది క్యాన్సర్‌కు కారణమయ్యే అఫ్లాటాక్సిన్‌ను ఉత్పత్తి చేసే మైకోటాక్సిన్‌లను కలిగి ఉంటుంది, ఇది నేరుగా కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ ఫంగస్ అభివృద్ధి చెందే అవకాశం ఎక్కువ. ఎక్కువ బూజు పట్టిన ఖర్జూరం తిన్న కొందరికి వాంతులు, తల తిరుగుతున్నట్లు అనిపించవచ్చని నిపుణులు తెలిపారు. కొన్ని ఖర్జూరాలకు ముదురు నలుపు రంగు రావడానికి, అవి చెడిపోకుండా ఉంచడానికి సల్ఫేట్లను కలుపుతారని కొన్ని అధ్యయనాల్లో తేలింది. ఈ సల్ఫేట్ విచ్ఛిన్నమైనప్పుడు, అది ఆస్తమా, అలర్జీలకు కారణం కావచ్చుట. కాబట్టి, ప్యాకెట్లపై ఉండే లేబుళ్లను జాగ్రత్తగా గమనించి, గడువు తేదీని నిర్ధారించుకున్న తర్వాతే ఖర్జూరం కొనుగోలు చేయడం మంచిది. వినియోగదారులు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి.

## పచ్చి మామిడి కాయతో ఆరోగ్యానికి పిచ్చి లాభాలు.



వేసవి రాగానే అందరికీ ముందుగా గుర్తొచ్చేది పండ్ల రాజైన మామిడి పండు. ఆ తియ్యని, రసవంతమైన రుచిని ఇష్టపడని వారుండరు. అయితే కేవలం పండు మాత్రమే కాదు.. పుల్లగా ఉండే పచ్చి మామిడికాయ కూడా ఈ సీజన్‌లో ఒక అమృతం లాంటిదనే చెప్పాలి. ఉగాది పచ్చడి నుండి నోరూరించే ఆవకాయ వరకు, ఘాటైన చట్నీల నుండి చల్లని ఆమ్ పన్నా వరకు పచ్చి మామిడికాయలను ప్రతి ఇంట్లో రకరకాలుగా వాడుతుంటారు. పచ్చి మామిడికాయ కేవలం నోటికి రుచిని అందించడమే కాదు.. ఎండ తీవ్రత నుండి మన శరీరాన్ని కాపాడే బోలెడన్ని పోషకాల గని అని నిపుణులు చెబుతున్నారు. ఇందులో విటమిన్ ఎ, సి, కె, బి6 లతో పాటు ఫైబర్, ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. వేసవిలో పచ్చి మామిడికాయను మన డైట్‌లో చేర్చుకోవడం వల్ల కలిగే ఆ 6 అద్భుత ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం..

జీర్ణక్రియకు అమృతం.. మలబద్ధకానికి చెక్

నిపుణుల అభిప్రాయం ప్రకారం.. పచ్చి మామిడికాయలలో పీచుపదార్థం అత్యధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. వేసవిలో వేడి వల్ల వచ్చే మలబద్ధకం, కడుపు ఉబ్బరం, ఎసిడిటీ వంటి సమస్యలను నివారించడంలో పచ్చి మామిడికాయ ఒక దివ్యౌషధంగా పనిచేస్తుంది.

నిగనిగలాడే చర్మం.. దృఢమైన జుట్టు

పచ్చి మామిడిలో ఉండే విటమిన్ ఎ, విటమిన్ సి, జింక్, ఐరన్, విటమిన్ ఇ వంటి పోషకాలు మీ జుట్టుకు, చర్మానికి అద్భుతమైన పోషణను అందిస్తాయి. ఇందులోని విటమిన్ సి శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి చర్మంపై ముడతలు పడకుండా గ్లో తెస్తుంది. అలాగే ఐరన్, జింక్ జుట్టు కుదుళ్లను బలపరిచి జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి.

గుండె ఆరోగ్యానికి శ్రీరామరక్ష

పచ్చి మామిడికాయలలో శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి సహాయపడే పవర్‌ఫుల్ యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. అంతేకాకుండా వాటిలోని ఫైబర్, పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. తద్వారా మొత్తం గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది.

డయాబెటిస్ ఉన్నవారికి కూడా సేఫ్

పచ్చి మామిడికాయకు గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. దీనివల్ల ఇది తిన్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగవు. ఇందులో పీచుపదార్థం అధికంగా ఉండటం వల్ల, ఇది మధుమేహ రోగుల మెటబాలిజానికి ఎంతో ఉపయోగపడుతుంది. అయితే ఊరగాయల రూపంలో కాకుండా పచ్చి ముక్కలుగా లేదా పన్నా రూపంలో తీసుకోవడం మంచిది.

డీహైడ్రేషన్, వడదెబ్బ నుండి రక్షణ


ఎండల్లో తిరగడం వల్ల శరీరం లోని సోడియం క్లోరైడ్, స్వేదం రూపంలో బయటకు పోయి నీరసం వస్తుంది. పచ్చి మామిడికాయను కొద్దిగా ఉప్పు చల్లుకుని తినడం వల్ల లేదా దాని జ్యూస్ తాగడం వల్ల శరీరంలో ఎలక్ట్రోలైట్స్ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుంది. ఇది వడదెబ్బ తగలకుండా బాడీని చల్లబరుస్తుంది.

లివర్, గాల్ బ్లాడర్ క్లీనింగ్

పచ్చి మామిడి ముక్కలను నమలడం వల్ల లాలాజలం, పిత రసం ఉత్పత్తి పెరుగుతుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరచడానికి, ప్రేగులలో బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లను అరికట్టడానికి ఎంతగానో తోడ్పడుతుంది.

పచ్చి మామిడికాయ ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినప్పటికీ, దీనిని అతిగా తినకూడదు. ముఖ్యంగా కాయ కోసినప్పుడు వచ్చే జిగురు నోటికి లేదా పెదవులకు అంటకుండా జాగ్రత్తపడాలి, లేదంటే బొబ్బలు వచ్చే అవకాశం ఉంది.

## ఐపీఎల్ ఫైనల్‌కు ఊహించని గెస్ట్



ఐపీఎల్ 2026 ముగింపు వేడుకలకు సర్వం సిద్ధమైంది. నేడు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గుజరాత్ టైటాన్స్ మధ్య ఫైనల్ ఫైట్ జరగనుంది. అయితే ఈ రేసులో రాజస్థాన్ రాయల్స్ జట్టు ఫైనల్‌కు చేరనప్పటికీ, ఆ జట్టు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మాత్రం అహ్మదాబాద్‌లో తళుక్కున మెరిశాడు. ప్లేఆఫ్స్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయిన ఈ టీనేజ్ సెన్సేషన్, నేడు జరగబోయే గ్రాండ్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు వచ్చాడు. ఈ టోర్నమెంట్‌లో అతడు చూపించిన అసాధారణ ప్రదర్శనకు గాను స్టేడియంలో అతడిని సత్కరించే అవకాశం కూడా ఉంది. ఈ సీజన్ ప్లేఆఫ్స్ మ్యాచ్‌ల్లో వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్ రాయల్స్ తరఫున విధ్వంసకర బ్యాటింగ్‌తో రెచ్చిపోయాడు. మొదట సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో కేవలం 29 బంతుల్లోనే 12 సిక్సర్లు, 5 ఫోర్లతో ఏకంగా 97 పరుగులు సాధించాడు. ఇతడి ఊచకోత వల్లే రాజస్థాన్ జట్టు 243 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆ తర్వాత గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన క్వాలిఫయర్-2 లో కూడా ఒంటరి పోరాటం చేస్తూ 47 బంతుల్లో 7 సిక్సర్లు, 8 ఫోర్లతో 96 పరుగులు చేసి జట్టుకు 214 పరుగుల గౌరవప్రదమైన స్కోరును అందించాడు.వైభవ్ సూర్యవంశీ క్వాలిఫయర్-2 లో అద్భుతంగా ఆడినప్పటికీ రాజస్థాన్ రాయల్స్‌కు విజయం దక్కలేదు. గుజరాత్ టైటాన్స్ జట్టు కంప్లీట్ డామినేషన్‌తో రాజస్థాన్ నిర్దేశించిన 214 పరుగుల లక్ష్యాన్ని చాలా సులువుగా ఛేజ్ చేసింది. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 104 పరుగులతో సెంచరీ బాదగా, ఓపెనర సాయి సుదర్శన్ 58 పరుగులతో అదరగొట్టాడు. దీంతో రాజస్థాన్ రాయల్స్ టోర్నీ నుంచి నిష్క్రమించగా, గుజరాత్ టైటాన్స్ ఫైనల్లోకి అడుగుపెట్టింది.

ఫైనల్ మ్యాచ్‌కు ముందు వైభవ్ సూర్యవంశీ అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు అతడిని ఫైనల్ మ్యాచ్ వేదికపై ప్రత్యేకంగా సత్కరించే ఛాన్స్ ఉందని టాక్ నడుస్తోంది. అయితే ఈ సీజన్ ముగిసే సమయానికి ఆరెంజ్ క్యాప్ అతడి వద్దే ఉంటుందా లేదా అనేది ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది.

ప్రస్తుతం ఐపీఎల్ 2026 సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో వైభవ్ సూర్యవంశీ 16 ఇన్నింగ్స్‌ల్లో 776 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. రాజస్థాన్ టోర్నీ నుండి అవుట్ అయినందున వైభవ్‌కు ఇక మ్యాచ్‌లు లేవు. కానీ, రన్నర్ల జాబితాలో తర్వాతి స్థానాల్లో ఉన్న గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్‌లకు ఇంకా ఒక మ్యాచ్ మిగిలి ఉంది. వీరిద్దరూ ఫుల్ ఫామ్‌లో ఉండటంతో వైభవ్ ఆరెంజ్ క్యాప్ చేతులు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at HNo:1-94 nekunampuram,pokur,Prakasam,andhrapradesh 523113Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2843. Ph:9849707349 . email:kvp6858@gmail.com.

జర్నలిస్టులు కావలెను

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక గత 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.

APTEL/25/A2844

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

క్రిష్ణా | సంపుటి : 02 సంచిక : 183 సోమవారం 01- 06 - 2026 పేజిలు : 4 వెల. 2

రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో
- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు
కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు
98497 07349

## చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

### - రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఇబ్రహీంపట్నం పోలీసుల హెచ్చరిక


### - శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించిన సీఐ సుబ్రహ్మణ్యం



**ఎన్టీఆర్ జిల్లా,ఇబ్రహీంపట్నం, మే 31(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):** ఇబ్రహీంపట్నం పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు ప్రజల్లో భద్రతాభావం పెంపొందించే లక్ష్యంతో ఆదివారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు మరియు పోలీసుల నిఘాలో ఉన్న వ్యక్తులను హాజరుపరిచి వారికి చట్టపరమైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు, గొడవలు, బెదిరింపులు, భూవివాదాలు, అక్రమ కార్యకలాపాలు లేదా ఇతర చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినట్లయితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని సూచించారు.పోలీసుల లక్ష్యం కేవలం కేసులు నమోదు చేయడం మాత్రమే కాదని, నేరాల నివారణకు ప్రాధాన్యతనిస్తూ వ్యక్తుల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ముఖ్య ఉద్దేశమని సీఐ తెలిపారు. గతంలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులు తిరిగి అలాంటి చర్యలకు పాల్పడకుండా సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు.
అదేవిధంగా యువతను తప్పుదోవ పట్టించే చర్యలకు దూరంగా ఉండాలని, శాంతి భద్రతలకు భంగం కలిగించే ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనరాదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత మరియు ప్రశాంత వాతావరణ పరిరక్షణ కోసం ఇటువంటి కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లలో చట్టంపై అవగాహన పెంపొందించడంతో పాటు నేరరహిత సమాజ నిర్మాణానికి దోహదపడే సందేశాన్ని పోలీసులు అందించారు.

## భాగస్వాములందరికీ అభినందనలు.. 2న 'సర్'పై ఎమ్మెల్యేలకు అవగాహన

**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** తొలిసారి హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు గ్రాండ్ సక్సెస్ అయిందని సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మహానాడును సమర్థంగా నిర్వహించడంలో భాగస్వాములైన నేతలు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన చంద్రబాబు జోనల్ కో-ఆర్డినేటర్లు, ముఖ్య నేతలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముమ్మందు పార్టీ తరఫున నిర్వహించే భారీ కార్యక్రమాలకు మహానాడు-2026ను బెంచ్ మార్క్‌గా తీసుకోవాలని సూచించారు. ఏపీతో పాటు ఈసారి తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మహానాడు బాగా జరిగిందని నేతలు సీఎంకు వివరించారు. మహానాడులో తెలంగాణ టీడీపీ సీనియర్ నేత బక్కని నర్సింహులు తెలంగాణపై చేసిన వ్యాఖ్యలను సీఎం తప్పుబట్టారు. ఎంతో చరిత్ర, నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగువారు ఎక్కడ ఉన్నా తెలుగుజాతి ఒక్కటేనని.. ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడకూడదని సీఎం వ్యాఖ్యానించారు. టీడీపీ పుట్టిందే తెలంగాణ గడ్డపై అని, తెలంగాణలో పార్టీకి ఇప్పటికీ బలమైన కేడర్ ఉన్నారని అన్నారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత తెలంగాణలో సామాజిక న్యాయం, అభివృద్ధికి బాటలు పడ్డాయని పేర్కొన్నారు. మహానాడులో ఆమోదించిన 33 శాతం మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. ఎన్నికల



సంఘం చేట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)పై అవగాహన కల్పించేందుకు జూన్ 2న టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించాలని సీఎం ఆదేశించారు. క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయిల్లోనూ నిర్దేశిత సమయాన్ని పెట్టుకుని క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అచ్చెన్నాయుడు, రామానాయుడు, నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, జోనల్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## స్పిల్‌వే నుంచి భారీ ప్రవాహ తాకిడికి భూమి కోతకు గురయ్యే ప్రమాదముంది



**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** గోదావరి వరదతో స్పిల్‌వే నుంచి ప్రవాహ తాకిడికి భూమి కోతకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని అంతర్జాతీయ నిపుణుడు, పోలవరం నిపుణుల కమిటీ సభ్యుల్లో ఒకరైన సీన్ హించ్‌బర్గర్ రాష్ట్ర జలవనరుల శాఖకు సూచించారు. ఈ నెల 26న రాజమహేంద్రవరానికి వచ్చిన ఆయన రెండు రోజుల పాటు పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలోని ప్రధాన డ్యామ్ ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ పనులను పరిశీలించారు. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులపైనా లోతైన సమీక్ష చేపట్టారు. రాజమహేంద్రవరంలోని పోలవరం ప్రాజెక్టు అథారిటీ కార్యాలయంలో సీఈవో సంజీవ్ వోహ్రా, పీపీఏ కార్యదర్శి రఘురామ్, జల వనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి తదితరులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తంచేసిన హించ్‌బర్గర్.. వరద ప్రవాహంపై అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. స్పిల్‌వే నుంచి స్పిల్ చానల్ మీదుగా ప్రవాహం 14 లక్షల క్యూసెక్కులు దాటి వేగంగా నదిలో కలిసినప్పుడు భూమి కోతకు గురయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. భూమి కోతకు గురికాకుండా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలన్నారు. కాగా 2020లో వచ్చిన వరదకు డయాఫ్రమ్‌వాల్ దెబ్బతింది. అప్పట్లో గ్యాప్-1, గ్యాప్-2 ద్వారా వరద ప్రవహించింది. ఇప్పుడు కాఫర్ డ్యామ్‌ను పూర్తిగా నిర్మించడంతో వరదంతా స్పిల్‌వే, స్పిల్ చానల్ ద్వారానే కిందకు వెళ్తూ గోదావరి నదిలో కలుస్తోంది. 2020 తరహాలో గోదావరికి భారీ వరద వస్తే.. స్పిల్‌వేను దాటి స్పిల్‌చానల్ మీదుగా వరద సుడులు తిరుగుతూ నదిలోకి జలాలు వెళ్లే చోట భూమి కోతకు గురయ్యే ప్రమాదముందని రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుడివైపునకు ఈ వరద వెళ్తే తగు రక్షణ చర్యలు ఉన్నా.. ఎడమవైపు భూమి కోతకు గురైతే మాత్రం పెను విధ్వంసం జరుగుతుందన్న ఆందోళన కనిపిస్తోంది. వరద జలాలు పురుషోత్తపట్నం వైపునకు వెళితే భారీ నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఎలాంటి ఉపద్రవం రాకుండా స్పిల్‌చానల్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని కేంద్ర జల సంఘానికి రాష్ట్ర జల వనరుల శాఖ గడచిన రెండేళ్లుగా అభ్యర్థిస్తూనే ఉంది. కానీ కేంద్ర జలసంఘం మాత్రం ఇప్పటిదాకా ఎలాంటి నిర్ణయాన్ని తీసుకోకుండా నాన్చుడు ధోరణితో ఉంది. తాజాగా అంతర్జాతీయ నిపుణుడు సీన్ హించ్‌బెర్గర్ సూచనలు చేయడంతో మరోసారి సీడబ్ల్యూసీ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలుస్తోంది. స్పిల్‌చానల్ వద్ద రక్షణ చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టకపోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో విషాదం

**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో ఓ రోగి మృతి చెందిన ఘటన అనంతపురంలో జరిగింది. మరికొంత మంది ఎమర్జెన్సీ వార్డులో వైద్యం అందక విలవిల్లాడిపోయారు. అనంతపురంలో శనివారం గాలివాన కారణంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చీకటి అలుముకుంది. కరెంట్ లేకపోవడంతో వెంటిలేటర్ మిషన్లు ఆగిపోయాయి. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన మోహన్ (45) మృతిచెందాడు. ఇదే విభాగంలో వెంటిలేటర్‌పై ఉన్న ఇల్లూరు గ్రామానికి చెందిన నాగన్న ఊపిరి అందక విలవిల్లాడాడు. ప్రసూతి వార్డులో విద్యుత్ సరఫరా లేక వైద్యులు తీవ్ర ఆందోళన చెందారు. ఎస్ఎన్‌సీయూ, ఎన్ఐసీయూలో వార్మర్లు, వెంటిలేటర్లపై ఉన్న నవజాత శిశువులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆస్పత్రిలో కరెంట్ పోగానే ఆటోమేటిక్‌గా ఆన్ అవ్వాల్సిన జనరేటర్.. నిర్వహణ సరిగాలేక ఆన్ అవ్వలేదు. సుమారు 15 నిమిషాలపాటు తంటాలు పడితే ఆన్ అయ్యింది. అప్పటికే ఒకరు మృతిచెందగా, పలువురికి ఊపిరి ఆగినంతపనైంది.
ఉదయమే అడ్మిట్ అయ్యాంనా భర్త మోహన్ కొన్ని నెలలుగా పెరాలసిస్, షుగర్, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నాడు. పెద్దాస్పత్రిలో ఎమర్జెన్సీ వార్డులో శనివారం ఉదయం అడ్మిట్ చేయించాం. వెంటిలేటర్‌పై పెట్టడంతో తిరిగి కోలుకుంటాడన్న ధైర్యం వచ్చింది. కానీ సాయంత్రం కరెంట్ పోవడంతో వెంటిలేటర్ ఆగిపోయింది. దాంతో నా భర్త మృతిచెందాడు. మా కుటుంబానికి దిక్కులేకుండా పోయింది.చెప్పినా విద్యుత్ అధికారులు పట్టించుకోలేదు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో విద్యుత్ సరఫరా సరిగాలేదని ఏపీఎంఎ?సఐడీసీ అధికారులకు నెల కిందటే చెప్పాం. స్తంభాలు పాతబడ్డాయని, ఎక్కడిక్కడి వాలిపోతున్నాయని, లైన్లు తెగిపోతున్నాయని ఫిర్యాదు చేశాం. సమస్యలన్నీ వివరించాము. మరమ్మతులకు ఖర్చు ఎక్కువ అవుతుందని నిర్లక్ష్యం చేశారు. గాలివాన కారణంగా శనివారం సాయంత్రం స్తంభాలు కూలి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

## తుంగలో విషాదాంతమైన ఈత సరదా

**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** నదిలో ఈతకు దిగినవారిలో ఓ బాలుడు కొట్టుకుపోతుండగా, అతడిని కాపాడేందుకు ప్రయత్నించిన తండ్రి సహా మరో నలుగురు గల్లంతయ్యారు. ఈ విషాద ఘటన కర్నూలు జిల్లా మంత్రాలయం వద్ద తుంగభద్ర నదిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. మంత్రాలయం పాతవీధికి చెందిన కాలప్ప ఆచారి, మౌనమ్మ దంపతుల కుమారుడు శశిధర్‌కు ఈనెల 7న వివాహం జరిగింది. ఆదివారం సత్యనారాయణ వ్రతానికి ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ పూజలో పాల్గొనేందుకు మంత్రాలయానికి చెందిన కాలప్పఆచారి తమ్ముడి కుమారుడు రాఘవేంద్రాచారి (28)... హైదరాబాద్‌కు చెందిన సతీశ్‌చంద్ర (36), అతడి కుమారుడు యువన్‌చంద్ర (5), ఎమ్మిగనూరుకు చెందిన ధను (22), అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన సంధ్య (21), ఆదోనికి చెందిన కమ్మరి అపర్ణతో కలిసి శనివారం వచ్చారు. ఈ ఆరుగురు శనివారం సాయంత్రం తమ ఇంటి సమీపంలో ఉన్న తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లారు. అంతవరకు సరదాగా ఈతకొడుతూ గడిపారు. ఐదేళ్ల యువన్‌చంద్ర అనే బాలుడు నీటిలో మునిగిపోతుండగా కాపాడేందుకు తండ్రి సతీశ్‌చంద్ర, రాఘవేంద్రాచారి, ధను, సంధ్య, అపర్ణ నీటిలో దిగి ప్రమాదవశాత్తూ గల్లంతయ్యారు. అపర్ణను సమీపంలో ఉన్న గ్రామస్థులు చూసి.. వెంటనే ఆమెను కాపాడారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గల్లంతైన వారికోసం పుట్టీల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో వద్ద ధను మృతదేహం లభ్యమైంది. అగ్నిమాపక సిబ్బందితో రాత్రి 8గంటల వరకు గాలింపు కొనసాగించారు.గల్లంతైనవారి కోసం గాలింపు చర్యలు చేపడుతుండగా ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. గల్లంతైన కుటుంబంలో వ్యక్తి అని అందరూ భావించగా మృతదేహాన్ని నదినుంచి బయటకు తీయడంతో వృద్ధుడి మృతదేహం చూసి అవాక్కయారు. మృతుడు కర్ణాటక రాష్ట్రం హాసన్ జిల్లా బేలూరు తాలూకా దొడ్డమేదుర్ గ్రామానికి చెందిన డీహెచ్ యాలక్కిగౌడ (75)గా పోలీసులు గుర్తించారు.





## ఎండిపోయి ఎడారిని తలపిస్తున్న కొల్లేరు

**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** వందలాది పక్షుల కిలకిలరావాలు... గుంపులు గుంపులుగా ఎగిరే సైబీరియా పక్షులు... ఓ చెట్టు పైనుంచి మరో చెట్టుపైకి.. ఆ చెట్టు పైనుంచి ఒక్కసారిగా నీటిలో దూకి.. చేపను నోట కరచుకుని మళ్లీ చెట్టెక్కి వాటిని ఆరగించే దృశ్యాలు.. నీటిపై పక్షుల సయ్యాటలు... పర్యాటకులను కట్టిపడేసే అందాలు.. ఇదీ ఆటపాక పక్షుల కేంద్రం పేరు వింటే పర్యాటకులకు గుర్తొచ్చే అందమైన దృశ్యమాలిక. ఇదంతా గతం. ఈ వేసవిలో అక్కడ అంతా నిశ్శబ్దం తాండవిస్తోంది. ఆసియాలోనే అతిపెద్ద మంచినీటి సరస్సుగా గుర్తింపు పొందిన కొల్లేరు ప్రస్తుతం ఎండిపోయి ఎడారిని తలపిస్తోంది. పరవళ్లు తొక్కే.. నీటితో కళకళలాలే సరస్సు... బీటలు వారిన నేలతో దయనీయంగా కనిపిస్తోంది. పక్షులకు ఆహారం, ఆశ్రయం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయాయి. ఎగరలేని కొన్ని మాత్రమే ఇంకా చెట్లపై కనిపిస్తున్నాయి. ఏలూరు జిల్లా కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రం దుస్థితి ఇది. కొల్లేరు కాంటూరులో పెరుగుతున్న అక్రమ ఆక్వా చెరువులు సరస్సు సహజ స్వరూపాన్ని దెబ్బతీస్తున్నాయి. ఆక్వా చెరువుల కోసం నీటిని మళ్లించడం వల్ల సరస్సులో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. కొల్లేరు ప్రాంతంలో ఏడాది పొడవునా నీరు ఉండేలా రెగ్యులేటర్ నిర్మించాలని పలు కమిటీలు గతంలో సూచించినా.. ఇంతవరకూ ఆచరణలోకి రాలేదు. కొల్లేరు పరిరక్షణకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ), సుప్రీంకోర్టు పలుమార్లు ఆదేశాలు జారీ చేసినా అమలుకు నోచుకోలేదు. ఆక్రమణలను తొలగించి, సరస్సులోకి మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు. ఆటపాక పక్షుల కేంద్రాన్ని పునరుద్ధరించి, కొల్లేరు జీవవైవిధ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

## నకిలీ మద్యం కేసులో సుప్రీం ఆదేశం



**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసులో నిందితులు దాసరిపల్లి జయచంద్రారెడ్డి, మంత్రి గిరిధర్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. వారిపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సర్వోన్నత న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. అక్రమ మద్యం తయారీ కేసులో తమ పేర్లను చట్టవిరుద్ధంగా చేర్చారని ఆరోపిస్తూ, ముందస్తు బెయిల్ కోసం వారు దాఖలు చేసిన పిటిషన్లను ఏపీ హైకోర్టు తిరస్కరించింది. దీంతో వారిద్దరూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. వాదనల సందర్భంగా, అక్రమ మద్యం తయారీ వ్యవహారంలో పిటిషనర్లకు ఎలాంటి ప్రత్యక్ష లేదా పరోక్ష సంబంధం లేదని, రాజకీయ, వ్యక్తిగత కారణాలతో వారి పేర్లను కేసులో చేర్చారని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం పిటిషనర్లు విదేశాల్లో ఉన్నారని, అరెస్టు భయం నెలకొన్నందున స్వదేశానికి రావడానికి కూడా సంకోచిస్తున్నారని వివరించారు. పిటిషనర్ల వాదనలు విన్న అనంతరం సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు పిటిషనర్లపై ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. పిటిషనర్లు విదేశాల నుంచి తిరిగి వచ్చిన రెండు వారాల్లోపు దర్యాప్తు సంస్థ ఎదుట హాజరై విచారణకు సహకరించాలని ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన కోర్టు, తదుపరి విచారణను జూలై 30కు వాయిదా వేసింది. రెండు వారాల్లోపు కౌంటర్ అఫిడవిట్‌ను, ఆ తర్వాత రెండు వారాల్లో రిజాయిండర్ అఫిడవిట్‌ను దాఖలుచేయాలని ఇరుపక్షాలకూ స్పష్టం చేసింది.కాగా, అన్నమయ్య జిల్లా ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం తయారీ గుట్టును గత ఏడాది అక్టోబరు 3వ తేదీన ఎక్సైజ్ పోలీసులు రట్టు చేశారు. భారీగా నకిలీ మద్యం, తయారీ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి 35 మందిపై కేసు నమోదు చేసి 33మందిని అరెస్టు చేశారు. తంబళ్లపల్లె టీడీపీ మాజీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి(ఏ17), గిరిధర్‌రెడ్డి(ఏ18)లనూ నిందితులుగా చేర్చారు. కాగా, శనివారం సుప్రీంకోర్టు ఉత్తర్వులను జయచంద్రారెడ్డి సతీమణి కల్పనరెడ్డి ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్‌కు ఇచ్చారు.

## త్వరలో 3 వేల ఈవీ బస్సులు : మండిపల్లి

ఆర్టీసీ బస్సుల ఆధునికీకరణ, ఈవీ బస్సుల విస్తరణ, ఉద్యోగుల సంక్షేమం తదితర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో దశల వారీగా ఈవీ బస్సుల విస్తరణకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. తొలిదశలో 700 ఈవీ బస్సులు రెండు నెలల్లో అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. విశాఖపట్నం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి 40 ప్రత్యేక బస్సులను కేటాయించనున్నట్లు తెలిపారు. గోదావరి పుష్కరాల సందర్భంగా గోదావరి పేరున ప్రత్యేక బస్సు సర్వీసులను నిర్వహించనున్నట్లు తెలిపారు.

## రంపచోడవరంలో కమిషన్ సమీక్ష సమావేశం

**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** అది ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశం. జిల్లాలోని ఉన్నతాధికారులంతా హాజరు కావాలి. ముఖ్యంగా జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఐటీడీఏ పీవో అక్కడ ఉండాలి. శనివారం ఉదయం 11 గంటలకు కమిషన్ సభ్యులతో కలిసి చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి పోలవరం జిల్లా రంపచోడవరం ఐటీడీఏలో ఏర్పాటు చేసిన సమావేశానికి వచ్చారు. ఆ సమయానికి అక్కడ ఒక్క జిల్లా అధికారి కూడా లేరు. 12.30 గంటలకూ ఒక్కరు కూడా రాలేదు. కలెక్టరు దినేశ్‌కుమార్ మాత్రం.. తాను ముఖ్యకార్యదర్శి సమావేశానికి హాజరుకావాల్సి ఉందని, తర్వాత వస్తానని సమాచారం ఇచ్చారు. ఇతర ఉన్నతాధికారులెవరూ సమావేశానికి రాలేదు. రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రొటోకాల్ నిబంధనలు పాటించలేదు. దీనిపై చైర్మన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. అధికారులెవరూ హాజరుకానప్పుడు తాము సమీక్ష నిర్వహించడంలో అర్థం లేదని, గిరిజనాభివృద్ధిపై అధికారులకు శ్రద్ధలేదని చెప్పడానికి ఇదే నిదర్శనమని మండిపడ్డారు. తన సభ్యులతో కలిసి ఐటీడీఏ సమావేశ మందిరం నుంచి తన క్యాంపు కార్యాలయానికి వెళ్లి, గ్రీవెన్సు నిర్వహించారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న ఐటీడీఏ పీవో ప్రశాంతకుమార్‌పై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులపై ఐటీడీఏకు, ఇక్కడి అధికారులకు శ్రద్ధ లేదని మండిపడ్డారు. గిరిజనాభివృద్ధిపై శ్రద్ధలేని అధికారులు ఇక్కడ పనిచేయడం సరికాదని, ఎస్టీ కమిషన్‌కు తీవ్ర అవమానం జరిగిందని, ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తానని, బాధ్యులైన అందరిపైనా చర్యలు తీసుకోవాలని కోరతానని చైర్మన్ బొజ్జిరెడ్డి చెప్పారు.

## జూన్ వర్షాలను చూసి దీర్ఘకాలిక పంటలు వద్దు



**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** జూన్‌లో కురిసే తొలకరి వర్షాలను చూసి రైతులు తొందరపడి వరి సాగుకు వెళ్లొద్దు. నీటి లభ్యతపై స్పష్టత వచ్చిన తర్వాతే సాగు చేయాల్సిన పంటలను ఎంపిక చేసుకోవాలి' అని క్రిడా (సీఆర్‌ఐడీఏ) ప్రధాన శాస్త్రవేత్త కేవీ రావు సూచించారు. జూలై, ఆగస్టు నెలల్లో మధ్యంతర కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున అధిక నీరు అవసరమయ్యే దీర్ఘకాలిక వరి రకాల సాగుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన '2026లో ఎల్‌నినో సంభవిస్తుందన్న వాతావరణ సూచన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక వర్క్‌షా?ప'లో ఆయన ముఖ్యోపన్యాసం చేశారు. భారత వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండకపోవచ్చని, అయితే సాధారణ వర్షాలు కురుస్తాయని భావించి రైతులు నీరు ఎక్కువగా అవసరమయ్యే వరి వంటి పంటలను ఎక్కువగా సాగు చేయడం ప్రమాదకరమని చెప్పారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కూడా సాగునీరు అందుబాటులో ఉంటుందన్న పూర్తి భరోసా ఉన్నప్పుడే వరి సాగుకు వెళ్లాలని, లేకపోతే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని చెప్పారు. ఉపకులపతి పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావానికి ఎక్కువగా గురయ్యే ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో కూడా ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ వర్క్‌షా?పలో వచ్చిన సూచనలు, శాస్త్రవేత్తల సిఫార్సులను జిల్లాల వారీగా క్రోడీకరించి వ్యవసాయ శాఖ, డీఏఏటీటీ కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు అందజేస్తామని చెప్పారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేస్తే నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. వర్క్‌షా?పలో రాష్ట్రంలోని ఐదు వ్యవసాయ-వాతావరణ మండలాలకు సంబంధించిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను శాస్త్రవేత్తలు వివరించారు. కరువును తట్టుకునే పంట రకాలు, ఆలస్య వర్షాలకు అనువైన పంటలు, నీటి పొదుపు సాగు విధానాలపై సూచనలు చేశారు.

## సిట్ అధికారుల విచారణకు పుత్తా శంకర్ రెడ్డి

**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** మాజీ సీఎం జగన్ పీఏ కేఎన్‌ఆర్ చిన్ననాటి స్నేహితుడు పుత్తా శంకర్ రెడ్డి పాత ఫోన్లు ధ్వంసం చేసి సిట్ విచారణకు హాజరయ్యాడు. కొత్త ఫోన్ తీసుకెళ్లి అధికారులకు దొరికిపోయాడు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సిట్ అధికారులు ప్రశ్నించారు. శంకర్ రెడ్డి చేతిలో ఉన్న కొత్త ఫోన్‌ను గమనించిన సిట్ అధికారులు.. ఫోన్ ఎందుకు మార్చేశావని ప్రశ్నించారు. 'పాతది పాడైంది.. అందుకే కొత్తది కొనుక్కున్నా' అని సమాధానం చెప్పాడు. ఫోన్లో ఏముందో చూద్దామంటూ సిట్ అధికారులు పదే పదే అడిగినా.. పాస్‌వర్డ్ గుర్తులేదంటూ ఫోన్ చేతికి ఇచ్చేందుకు శంకర్‌రెడ్డి ససేమిరా అన్నట్లు తెలిసింది. 'నేను ఎవ్వరికీ బినామీ కాదు.. నాకు కేఎన్‌ఆర్ ఆస్తులు, ఆర్థిక లావాదేవీలతో ఎలాంటి సంబంధం లేదు' అంటూ సిట్ విచారణలో అమాయకత్వం ప్రదర్శించినట్లు సమాచారం. విచారణలో ఏది అడిగినా అన్నింటికీ తెలీదంటూ సమాధానం చెప్పాడు. అధికారులు తమ వద్ద ఉన్న ఆధారాలు ముందుంచి ప్రశ్నించగా.. అకౌంటెంట్ చెబుతాడంటూ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. సోమవారం మరోసారి విచారణకు రావాలని సిట్ అధికారులు ఆదేశించినట్టు తెలిసింది.



# కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు

**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** రాష్ట్రాన్ని డంపింగ్ యార్డు రహితంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా కొండవీడులోని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను శనివారం ఆయన సందర్శించారు. ప్లాంట్‌లో చెత్తను వేరు చేసే ప్రక్రియను, బాయిలర్లలో మండించి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ రాష్ట్రంలో రోజువారీగా 7,200 టన్నుల పొడి చెత్త ఉత్పత్తి అవుతోందని తెలిపారు. కొండవీడులోని జిందాల్ ప్లాంట్ నిత్యం 1,400 టన్నుల పొడి చెత్తను ప్రాసెస్ చేసి సగటున 20 మెగావాట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు అందజేస్తోందని వివరించారు. విశాఖలోని ప్లాంట్ ద్వారా 15 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోందని చెప్పారు. రాష్ట్రంలో మరో 6 ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాకినాడలో ఇప్పటికే పనులు ప్రారంభం కాగా కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు సుముఖంగా ఉన్నట్లు ప్రకటించారు. ప్రతి 100 కిలోమీటర్ల పరిధిలో ఒక వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి సమీప నగరాలు, గ్రామపంచాయతీల నుంచి చెత్తను సేకరించి ప్లాంట్లకు తరలిస్తామని చెప్పారు. ఒక మెగావాట్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్లాంట్ ఏర్పాటుకు రూ.25 కోట్లు ఖర్చవుతుందని, దీనికి సగటున 2.5 టన్నుల చెత్త, 4.5 టన్నుల స్టీమ్ అవసరమవుతాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. విద్యుత్ మాత్రమే కాకుండా పూలు, కూరగాయల వ్యర్థాల నుంచి బయో మిథైలైజేషన్ ప్రక్రియ ద్వారా బయోగ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని, చివరకు మిగిలే బూడిదను ఇటుకల తయారీకి వాడుకోవచ్చని పవన్ సూచించారు.రాబోయే గోదావరి పుష్కరాలను కాలుష్య రహితంగా నిర్వహించాలనే పట్టుదలతో ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. నదిలో ఎలాంటి వ్యర్థాలు కలవకుండా జిందాల్ తరహా పక్కా మేనేజ్‌మెంట్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. పుష్కరాలతో ప్రత్యక్ష సంబంధం ఉన్న 268 పంచాయతీలను క్లస్టర్లుగా విభజించి అక్కడి అధికారులకు వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ, వర్క్‌షా?పలు నిర్వహిస్తామని తెలిపారు. సింగపూర్‌లోని టాంజాంగ్ టెర్మినల్ తరహాలో వైజాగ్ పోర్టులో కూడా చెత్తను వేరు చేసే ప్రక్రియను ప్రయోగాత్మకంగా పరిశీలిస్తామని అన్నారు. స్వచ్ఛభారత్ అవార్డులు వరుసగా గెలుచుకుంటున్న ఇండోర్ నగరపాలక సంస్థలో చేపడుతున్న వ్యర్థాల సేకరణ విధానాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందిస్తున్నామని వివరించారు. చెత్త ద్వారా పంచాయతీలు ఆదాయం ఎలా గడించవచ్చో వివరిస్తూ గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని అధికారులను పవన్ ఆదేశించారు. కాగా, వ్యర్థాల సేకరణ, ఇంధన ఉత్పత్తిపై ప్లాంట్ ఆపరేషన్స్ హెడ్ చారి రూపొందించిన ప్రత్యేక నివేదికను పరిశీలించిన పవన్, దీనిపై సమగ్ర ప్రజంటేషన్ ఇవ్వాలని కోరుతూ అందుకు ప్రత్యేకంగా సమావేశం అవుదామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ నజీమా బేగం పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన ఆశావహులు



**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** రాష్ట్రం నుంచి రాజ్యసభకు వెళ్లేందుకు టీడీపీలో పోటీ పెరుగుతోంది. శనివారం పలువురు ఆశావహులు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. తమకు అవకాశమివ్వాలని కోరారు. రాష్ట్రం నుంచి ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాలకు ఆదివారం నోటిఫికేషన్ విడుదల కానుంది. శనివారం చంద్రబాబు టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చారు. ఆయనను కలిసినవారిలో రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, కంభంపాటి రామ్మోహనరావు, వర్ల రామయ్య ఉన్నారు. ఉమ్మడి కడప జిల్లా నుంచి వైసీపీ తరఫున ముగ్గురు రెడ్లు ఎంపీలుగా ఉన్నారని, రెండు దశాబ్దాలుగా టీడీపీ నుంచి రెడ్డి సామాజిక వర్గానికి రాజ్యసభ ప్రాతినిధ్యం లేదని, ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని శ్రీనివాసరెడ్డి సీఎంను కోరారు. ఎస్సీ సామాజికవర్గం నుంచి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని వర్ల రామయ్య... సీనియర్ నేతగా, టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవ చేస్తున్న వ్యక్తిగా తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కంభంపాటి రామ్మోహనరావు చంద్రబాబును కోరారు.రాష్ట్రం నుంచి పెద్దల సభకు వెళ్లే నలుగురు ఎవరనే అంశంపై రెండు మూడు రోజుల్లో స్పష్టత రానుంది. నాలుగు స్థానాల్లో ఒకటి జనసేనకు ఇవ్వడం ఖాయం. మరొకటి బీజేపీకి ఇస్తారని తొలుత భావించినా... ఈసారి టీడీపీలో ఒత్తిడి ఎక్కువగా ఉన్నందున ఆ స్థానమూ తామే తీసుకునేలా బీజేపీని ఒప్పించనున్నట్లు సమాచారం. వెరసి... టీడీపీ నుంచి ముగ్గురికి రాజ్యసభ చాన్స్ దక్కనుంది. తనకు తిరిగి అవకాశమివ్వాలని సానా సతీశ్ గట్టిగా కోరుతున్నారు. లోక్‌సభ చాన్స్ మిస్ అయిన తనను రాజ్యసభకైనా పంపాలని భాష్యం రామకృష్ణ అడుగుతున్నారు. ఇక... సామాజిక సమీకరణాలనూ చూసుకోవాల్సి ఉంది. మరోవైపు... భారత్ బయోటెక్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, టీటీడీ బోర్డు సభ్యురాలు సుచిత్రా ఎల్లా పేరు బాగా ప్రచారంలోకి వచ్చింది. అయితే, ఇప్పుడున్న పరిస్థితుల్లో టీడీపీతో నేరుగా సంబంధంలేని వారికి రాజ్యసభ అవకాశమిచ్చి ప్రయోగాలు చేయలేమని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. పార్టీ కోసం పని చేసిన, త్యాగం చేసిన వారికే అవకాశమిస్తే... 'మనలో ఒకరికి' పదవి ఇచ్చారనే భావన అందరిలో కలుగుతుందని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.



# విశాఖ కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభం

**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** ఉత్తరాంధ్ర ప్రజలు పోరాడి సాధించుకున్న 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' జూన్ 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించనుంది. విశాఖ కేంద్రంగా పనిచేసే ఈ జోన్ పరిధిలో విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లతో పాటు వాల్తేరు డివిజన్‌ను విభజించి కొత్తగా ఏర్పాటుచేసిన విశాఖపట్నం డివిజన్ కూడా ఉంటుంది. కార్యకలాపాల ప్రారంభ తేదీగా నిర్ణయించిన జూన్ 1న నాలుగు డివిజన్ల రైల్వే మేనేజర్లు విశాఖ వచ్చి జీఎం సందీప్ మాథుర్‌ను మర్యాదపూర్వకంగా కలుస్తారు. జోన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. వారితో జీఎం తొలి భేటీ కూడా ఉంటుంది. విశాఖపట్నం సిరిపురంలోని 'ది డెక్'' భవనంలో జోనల్ తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. విశాఖ కేంద్రంగా పనిచేసే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో 3,501 కి.మీ. పొడవైన ట్రాక్ ఉంది. నాలుగు డివిజన్ల పరిధిలో మొత్తం 385 రైల్వే స్టేషన్లు ఉండగా, మొత్తం 17వేల మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన జోనల్ కార్యాలయంలో 1,200 మంది పనిచేస్తున్నారు.

ఏటా రిక్రూట్‌మెంట్.. తెలుగువారికి ప్రాధాన్యం

ఉత్తరాంధ్ర నిరుద్యోగులు రైల్వే పరీక్షలు రాయడానికి తూర్పు కోస్తా రైల్వే జోనల్ కేంద్రం భువనేశ్వర్ వెళ్లినప్పుడు అక్కడి అధికారులు 'తెలుగువారు' అనే వివక్ష చూపించి, అవకాశాలు ఇచ్చేవారు కాదు. మనకూ ఒక జోన్ ఉంటే ఈ ప్రాంతం వారికి ఉద్యోగాలు వస్తాయనే ఉద్దేశంతో విశాఖ కేంద్రంగా జోన్ కోసం ఉద్యమం చేసి సాధించుకున్నారు. ఈ పరీక్షలకు కేంద్రాలను జోనల్‌కార్యాలయమే ఎంపిక చేస్తుంది. దాంతో ఈ ప్రాంతం వారికి మరిన్ని అవకాశాలు లభిస్తాయి.రైల్వేకు సరకు రవాణా ద్వారానే అధిక ఆదాయం వస్తుంది. విశాఖపట్నం కేంద్రంగా నడిచిన వాల్తేరు డివిజన్ సరకు రవాణాలో దేశంలోనే ఐదో స్థానంలో నిలిచింది. ఏటా 85 మిలియన్ టన్నుల సరకు రవాణా చేసేది. ఈ డివిజన్ పరిధిలో కొత్తవలస-కిరండూల్ (కేకే) లైన్ ఉండటమే దీనికి ప్రధాన కారణం. బైలదిల్లా గనుల నుంచి ముడి ఇనుము ఈ మార్గం ద్వారానే రవాణా జరగడం వల్ల ఏటా రూ.10వేల కోట్లకు పైగా ఆదాయం వచ్చేది. అయితే కొత్త జోన్ కోసం వాల్తేరు డివిజన్‌ను విడదీశారు. ఒడిశాలో ఉన్న భాగం అంతా రాయగఢలో కలిపి కొత్త డివిజన్ ఏర్పాటుచేశారు. కేకే లైన్ అటు వెళ్లిపోయింది. అయినా 2025-26లో ఒక్క విశాఖపట్నమే 40 మిలియన్ టన్నుల సరకును రవాణా చేసింది.

ప్రయోజనాలు..

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (సీపీఆర్వో)గా వి.బాలాజీ కిరణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, జోనల్ కార్యాలయం స్థానికంగా ఉండటం వల్ల రైళ్ల ఆపరేషన్‌కు సంబంధించిన నిర్ణయాలు త్వరితంగా వస్తాయి. మైనర్ ప్రాజెక్టులకు అనుమతులు త్వరగా లభిస్తాయి. మౌలిక వసతుల ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఉంటుంది.

## ఈ పథకానికి ఎంపికైన తొలి రాష్ట్రం మనదే

**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** దేశంలోని ఐటీఐలకు మహర్దశ పట్టించేందుకు కేంద్రం తీసుకొచ్చిన పీఎం సేతు పథకానికి రాష్ట్రం ఎంపికైంది. ఈ పథకం కింద విశాఖలోని ఐటీఐలను పారిశ్రామిక క్లస్టర్లుగా అభివృద్ధి చేసేందుకు ఆర్సెలార్ మిత్తల్ నిప్పాన్ ఇండియా చేసిన ప్రతిపాదనను జాతీయ స్టీరింగ్ కమిటీ ఆమోదించింది. అవసరమైన నిధులను కేంద్రం పీఎం సేతు పథకం కింద అందిస్తుంది. దేశంలోని దాదాపు వెయ్యి ప్రభుత్వ ఐటీఐలను ఆధునీకరించేందుకు రూ.60,000 కోట్లతో ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. ఈ పథకాన్ని తొలిసారిగా వినియోగించుకున్న రాష్ట్రంగా ఏపీ నిలవడం గమనార్హం. ఐటీఐ విద్యార్థులకు అవసరమైన సాంకేతిక బోధనా సదుపాయాలను కల్పిస్తారు. వారిలో సాంకేతిక నైపుణ్యాభివృద్ధిని పెంచేలా స్థానిక పరిశ్రమలతో భాగస్వామ్య ఒప్పందం చేసుకుంటారు. సామాజిక బాధ్యత కింద స్థానికంగా ఉన్న ఐటీఐల ఆధునీకరణకు, సాంకేతిక నైపుణ్యాలను పెంచేందుకు అప్రెంటిస్‌షిప్‌ను పరిశ్రమలు ఇస్తాయి. సాంకేతికాంశాలను మెరుగుపరిచేందుకు అవసరమైన నిధుల సమీకరణకు స్థానిక పరిశ్రమలు సహకారం అందిస్తాయి.

# సోలార్ వెలుగొచ్చింది..!

**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** :మండల పరిధిలోని పెదరావిగూడెం పంచాయతీ చీపురు గూడెం, బండారుగూడెం రెండు ఆదివాసీ గ్రామాలు ప్రధాన రహదారికి దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో ఉన్నాయి. దాదాపు 30 ఏళ్ల క్రితం వీరంతా చత్తీస్‌ఘడ్ ప్రాంతం నుంచి వలస వచ్చి ఆదివాసీ గ్రామాలు ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి ఈ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేదు. అటవీ శాఖ రిజర్వ్ ఫారెస్ట్ నిబంధనల ప్రకారం విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలంటే ఎన్నో ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో వారు చీకటిలోనే మగ్గుతూ ఇన్నేళ్లు కాలం గడిపారు. అయితే ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాభియాన్ (పీఎం జన్మన్) పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ విద్యుత్ శాఖాధికారులు ఈ గ్రామాలపై దృష్టి పెట్టారు. బండారుగూడెంలో 12 కేవీ, చీపురుగూడెం 13 కేవీ సోలార్ ఆఫ్‌గ్రిడ్‌ను దాదాపు రూ.65 లక్షలతో ఏర్పాటు చేశారు. దీంతో ఆ గ్రామానికి విద్యుత్ సౌకర్యం ఏర్పడింది. ఈ రెండు గ్రామాల్లో దాదాపు 85 ఆదివాసీ కుటుంబాలున్నాయి. శనివారం ఏలూరు సర్కిల్ సూపరింటెంటెండ్ ఇంజనీర్ పి.సాల్మన్‌రాజు సోలార్ ఆఫ్ గ్రిడ్‌ను ప్రారం భించారు. ఇప్పటి వరకు విద్యుత్ వెలుగులు ఎరుగని ఆదివాసీ గ్రామాలకు పీఎం జన్మన్ పథకం ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించామని ఆయన విలేకరులకు తెలిపారు.

# పెరిగిపోతున్న జగన్ పీఏ అక్రమాస్తుల చిట్టా

**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగత సహాయకుడు కె.నాగేశ్వరరెడ్డి(కేఎన్ఆర్) అక్రమాలు తవ్వేకొద్దీ బయటపడుతూనే ఉన్నాయి. ఆయన అక్రమాస్తుల చిట్టా చాంతాడంత పెరిగిపోతోంది. జగన్ అధికారం అండతో వందల కోట్ల విలువైన ఆస్తులు సంపాదించిన కేఎన్ఆర్ బినామీలూ రోజుకొకరు వెలుగులోకి వస్తున్నారు. ఆయన చిన్ననాటి స్నేహితుడు, కడప జిల్లాకు చెందిన పుత్తా శివశంకరరెడ్డి బినామీగా ఉన్నట్టు సిట్ ఇప్పటికే ఆధారాలు సేకరించింది. తాజాగా గుంటూరు జిల్లా మేడికొండూరుకు చెందిన దండా వీరారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. వైసీపీ హయాంలో ముఖ్యమంత్రి జగన్ పీఏ హోదాలో కేఎన్ఆర్ సంపాదించిన అక్రమ సొమ్ములో సింహభాగం దండా వీరారెడ్డి, ఆయన భార్య, ఇతర కుటుంబ సభ్యుల పేర్లతో పెట్టినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కామ్‌ను దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు కేఎన్ఆర్‌ను విచారించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన అక్రమాల బాగోతం వెలుగు చూసింది. మూడు రాష్ట్రాల్లో ఆస్తులు, ఇళ్లు, భూములు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో దండా వీరారెడ్డితోనూ కలిసి భారీగా ఆర్థిక లావాదేవీలు నిర్వహించినట్టు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. హైదరాబాద్‌లోని సంజీవరెడ్డి నగర్‌లో ఒక బార్‌లో వ్యాపార భాగస్వాములుగా ఉన్న ఈ ఇద్దరూ.. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఏకంగా ఆఫ్రికాలోని ఒక దేశం రాజును కలిసి అక్కడ లిక్కర్ వ్యాపారాలు చేశారు.

విజయవాడలోని రామవరప్పాడు ప్రాంతంలో 5400 చదరపు గజాల స్థిరాస్తి, హైదరాబాద్‌లోని కోకాపేట ప్రాంతంలో కోట్ల విలువ చేసే అత్యంత విలాసవంతమైన విల్లాను వీరారెడ్డి భార్య పేరుతో కొనుగోలు చేసినట్లు తెలిసింది. విశాఖపట్నం ప్రాంతంలో లేటరైట్ మైనింగ్, రియల్ ఎస్టేట్‌లో దందాల నుంచి ఏదీ వదలకుండా వసూళ్లు చేశారు. ఇందుకోసం బినామీ వీరారెడ్డి చేతికి గన్ ఇచ్చి విజయవాడ పటమట పోలీసులతో కేఎన్ఆర్ లైసెన్స్ ఇప్పించినట్లు తెలిసింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత వీరారెడ్డి తను పేరును లోకేశ్ రెడ్డిగా మార్చుకుని హైదరాబాద్‌కు మకాం మార్చాడు.

వైఎస్ హయాం నుంచే బంధం

వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హైదరాబాద్‌లోని ఎస్ఆర్‌నగర్‌లో ఒక బార్‌లో దండా వీరారెడ్డి భాగస్వామిగా చేరాడు. అక్కడే గెస్ట్ హౌస్ ఏర్పాటు చేసుకున్నాడు. అప్పట్లో ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లిన ఆయన లిక్కర్ వ్యాపారంలోకి దిగాడు. జగన్ మొదటి సారి కాంగ్రెస్ తరఫున కడప ఎంపీ



అయినప్పుడు పీఏగా ఆయన వద్ద చేరిన కేఎన్ఆర్‌కు వీరారెడ్డితో బంధం పెరిగింది. ఎస్ఆర్‌నగర్‌లో వీరారెడ్డి గెస్ట్ హౌస్‌కు వెళుతూ కొన్ని రోజులకే బార్‌లో భాగస్వామి అయ్యాడు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని కోకాపేట ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు సహకరించాల్సిందిగా దండా వీరారెడ్డి కోరడంతో కేఎన్ఆర్ తోడ్పాటు అందించి తనకు రావాల్సిన ప్రతిఫలాన్ని తీసుకున్నట్లు సమాచారం. 2009లో వైఎస్ మరణించడం, తర్వాత జగన్‌పై కేసులు నమోదై జైలుకు వెళ్లడంతో వీరిద్దరి రియల్ వ్యాపార జోరు తగ్గింది.

జగన్ సీఎం అయ్యాక.. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక దండా వీరారెడ్డి హైదరాబాద్ నుంచి మకాం తాడేపల్లికి మార్చాడు. కేఎన్ఆర్, వీరారెడ్డి ఇద్దరూ కలసి అడ్డూ అదుపూ లేకుండా వసూళ్ల పర్వం నడిపించారు. ఆఫ్రికా దేశాల్లో లిక్కర్ వ్యాపారం చేసే స్థాయికి ఎదిగారు. ఆఫ్రికాలోని ఒక దేశానికి ఇద్దరూ వెళ్లి అక్కడి రాజును కలిసినట్లు పాస్‌పోర్టు వివరాల ద్వారా పోలీసులు గుర్తించారు. వీరారెడ్డి, ఆయన భార్య, ఇతర కుటుంబ సభ్యుల పేర్లతో కేఎన్ఆర్ అక్రమాస్తులు పెట్టినట్లు ఇప్పటికే ఈడీకు తెలిసింది. దీంతో విచారణకు రావాలంటూ కేఎన్ఆర్‌కు నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. ఇదే సమయంలో ఏపీ, తెలంగాణలో ఇంకా ఎక్కడెక్కడ ఆస్తులు ఉన్నాయో ఆరా తీస్తున్న పోలీసులకు విజయవాడలోని పటమటలో వీరారెడ్డికి గన్ లైసెన్స్ ఇప్పించింది కేఎన్ఆర్ అని తెలిసింది. వీరి వ్యాపారాలు ఇంకెన్ని ఉన్నాయి? బాధితులు ఎంతమంది అనే దానిపై సిట్ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు.

# మెగా డీఎస్సీ అత్యంత పారదర్శకం



**క్రైం కౌంటర్ న్యూస్ మే 31:** మెగా డీఎస్సీ-2025ని అత్యంత పారదర్శకంగా నిర్వహించామని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల భర్తీ ప్రక్రియలో దరఖాస్తుల నుంచి తుది ఎంపిక వరకు ఎక్కడా ఒక్క ఉల్లంఘన కూడా జరగలేదని, పారదర్శక విధానంలో మెరిట్‌తోనే అభ్యర్థులంతా ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. డీఎస్సీలో అక్రమాలు అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. జిల్లాల వారీగా మెరిట్ జాబితాలు విడుదల చేశామని, మెరిట్ జాబితాలు ఇవ్వలేదనే ఆరోపణలో నిజం లేదని పేర్కొన్నారు. హారిజాంటల్ రిజర్వేషన్ విధానం అర్థంకాకే గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. 241 కోర్టు కేసులు పడినా.. వాటిని ఎదుర్కొని ముందుకు సాగామని, 148 రోజుల్లో రికార్డు స్థాయిలో నోటిఫికేషన్ ప్రక్రియను పూర్తిచేశామన్నారు. మెగా డీఎస్సీపై శనివారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మొత్తం ప్రక్రియ ఎలా జరిగిందో ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. "2018 తర్వాత 2025లో డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చింది. 16,347 పోస్టులు నోటిఫై చేశాం. 3.36 లక్షల మంది అభ్యర్థులు 5,77,675 దరఖాస్తులు చేసుకున్నారు. డీఎస్సీకి ముందు 2024 జూలైలో టెట్ నోటిఫికేషన్ జారీచేశాం. 3,00,068 మంది టెట్ రాస్తే, 1.87 లక్షల మంది అర్హత సాధించారు. డీఎస్సీలో టెట్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. 2025 ఏప్రిల్ 20న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ అయ్యింది. దరఖాస్తులను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే స్వీకరించాం. తొలిసారి ఈ నోటిఫికేషన్‌లోనే ఎస్సీ వర్గీకరణ అమలు చేశాం. ఇంత పెద్ద నోటిఫికేషన్‌లో హారిజంటల్ రిజర్వేషన్ వర్తింపజేయడం ఇదే తొలిసారి" అని కోన శశిధర్ పేర్కొన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే...13 సబ్జెక్టులు, 67 రకాల పోస్టులతో 89 సెషన్లలో మెగా డీఎస్సీ పరీక్షలు టీసీఎస్ అయాన్ సెంటర్ల ద్వారా నిర్వహించాం. 154 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, వాటిలో 19 రాష్ట్రం వెలుపల ఉన్నాయి. పరీక్షలు పూర్తిగా సీబీటీ విధానంలో జరిగాయి. ప్రతి పరీక్షకు 3 వేల ప్రశ్నలను సబ్జెక్టు నిపుణులు ఎస్‌సీఈఆర్‌టీ కార్యాలయంలోనే రూపొందించారు. అనంతరం టీసీఎస్ సర్వర్‌లోకి అప్‌లోడ్ చేశారు. ఈ క్వశ్చన్ బ్యాంకులను యాక్సెస్ చేసే అధికారం ఇద్దరు శాశ్వత ఉద్యోగులకే ఇచ్చారు. సర్వర్‌లో ముందే అప్‌లోడ్ చేసినా జంబ్లింగ్ విధానంలో ఎవరికి ఎలాంటి ప్రశ్నలు వెళ్లాలి అనేది పరీక్ష రోజే డీకోడ్ అయింది. అన్ని సబ్జెక్టులకు కలిపి 42వేల ప్రశ్నలు తయారు చేశాం. అవి ప్రతి సెషన్‌కు జంబ్లింగ్ అయ్యాయి. టీసీఎస్ అయాన్ ప్లాట్‌ఫామ్‌ను దేశంలోని ప్రముఖ సంస్థలు, హైకోర్టులు వినియోగిస్తున్నాయి. వీటిపై ఎక్కడా ఒక్క ఆరోపణ లేదు. క్వశ్చన్ బ్యాంక్ సర్వర్ నుంచి పూర్తిగా ఎన్‌క్రిప్ట్ అయ్యింది. అభ్యర్థికి ప్రశ్నలు వెళ్లేవరకూ ఎవరికి ఏం వస్తాయో ముందుగా తెలియదు. ప్రశ్నలను యాక్సెస్ చేసి చూడటం ఎవరికీ సాధ్యం కాదు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలున్నాయి. బయోమెట్రిక్ ద్వారానే అభ్యర్థులను అనుమతించారు. 24 రోజుల పాటు ఎలాంటి అవాంతరాలు లేకుండా పరీక్షలు జరిగాయి" అని వివరించారు. "జూలై 7న ప్రాథమిక కీలు విడుదల చేశాం. వాటిపై అభ్యంతరాలు స్వీకరించి, ఆగస్టు 1న తుది కీలు ఇచ్చాం. అదే నెల 11న నార్మలైజేషన్ స్కోర్లు ప్రకటించాం. 22న జిల్లాల వారీగా మెరిట్ జాబితాలు విడుదల చేశాం. సర్టిఫికెట్ల పరిశీలన సమయానికి సర్టిఫికెట్లన్నీ ఉండాలని స్పష్టం చేశాం. 1:1 నిష్పత్తిలో పోస్టుకు ఒకరు చొప్పున సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచాం. ఎవరైనా రాకపోతే తర్వాత మెరిట్ అభ్యర్థులకు అవకాశం వచ్చింది" అని శశిధర్ పేర్కొన్నారు."తొలిసారి ఇంత పెద్ద నోటిఫికేషన్‌లో హారిజంటల్ రిజర్వేషన్ విధానం అమలు చేశాం. ఈ విధానం అమలు చేయాలనేది సుప్రీంకోర్టు ఆదేశం. ఇందులో 3 శాతం మహిళా కోటా ఉంటుంది. మహిళా, దివ్యాంగుల, క్రీడా కోటా అభ్యర్థులకు హారిజాంటల్ రిజర్వేషన్ వర్తిస్తుంది. జీవో 77 ప్రకారం యథావిధిగా రిజర్వేషన్‌లో నిబంధనలు పాటించాం. ఇందులో ఎక్కడా ఉల్లంఘనలు లేవు. హారిజాంటల్ రిజర్వేషన్ విధానం కొందరికి పూర్తిగా అర్థం కాలేదు. దీంతో గందరగోళానికి గురై, వారికి ఉద్యోగాలు రాలేదు అనుకుంటున్నారు. మెరిట్ ఉన్న ఒక్క అభ్యర్థినీ పక్కన పెట్టలేదు. ఎంపిక అనంతరం కూడా జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి కమిటీలు నియమించి వినతు లు స్వీకరించి పరిష్కరించాం. అక్కడే ఎందుకు ఉద్యోగం రాలేదో వివరించాం. క్రీడా కోటా కాకుండా 16,291 మందిని పరిగణలోకి తీసుకోగా 15,569 మందిని ఎంపిక చేశాం. 722 మందిని తిరస్కరించాం' అని తెలిపారు.

నవీన్ సర్టిఫికెట్ల పరిశీలనకు రాలేదు

"ఎస్సీఈఆర్‌టీలో ఉద్యోగిగా ఉన్న నవీన్‌కు ర్యాంకులు రావడంపై చర్చ జరుగుతోంది. అతను 2016 నుంచి ఎస్సీఈఆర్‌టీలో పనిచేస్తున్నాడు. డీఎస్సీ పరీక్షలు రాస్తున్న విషయంలో శాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకోలేదు. దీంతో పరీక్షల అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేశాడు. రెండు పోస్టులో ఒక దానిలో మొదటి ర్యాంకు, మరో దానిలో ఆరో ర్యాంకు వచ్చింది. మెరిట్ జాబితాలు ఇచ్చాక అతను పరీక్షలు రాశాడని మా దృష్టికి వచ్చింది. అయినా అతన్ని సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచాం. కానీ నవీన్ హాజరు కాలేదు. అందుకే అతను ఎంపిక కాలేదు. కానీ తనకు ఉద్యోగం ఇవ్వలేదని హైకోర్టుకు వెళ్లాడు. జరిగిన విషయాన్ని న్యాయస్థానానికి వివరించాం. అతనికి ముందే పేపర్ లీకు కాలేదు. ఒక్కో క్వశ్చన్ బ్యాంక్‌లో 3 వేల ప్రశ్నలుంటాయి. రెండు పరీక్షలకు 6 వేల ప్రశ్నలు అతను చదివి గుర్తుంచుకోవడం కూడా సాధ్యం కాదు. ఎంపికైన వారిలో ఒక్కరూ అడ్డదారిలో రాలేదు. దీనిపై టీచర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. క్రీడా కోటా విషయంలో శాప్ ఇచ్చిన జాబితాలు తీసుకుని రిజర్వేషన్ అమలుచేశాం" అని వివరించారు.వీరికి ఉద్యోగాలు ఎలా వస్తాయి?

ఎం.ఏకాంబరం- ర్యాంకు 125, బీసీ(డి): చిత్తూరు జిల్లాలో ఈ కేటగిరీలో సోషల్ స్టడ?సలో మొత్తం ఏడు పోస్టులున్నాయి. మొద టి 5 ఉద్యోగాలు మెరిట్ ఆధారంగా 114 ర్యాంకు వరకు వచ్చాయి. ఆ తర్వాత దివ్యాంగుల కోటాలో 139 ర్యాంకు, 906 ర్యాంకు అభ్యర్థులకు ఉద్యోగాలు వచ్చా యి. హారిజాంటల్ రిజర్వేషన్‌లో పీహెచ్ అభ్యర్థులకు తప్పనిసరిగా ఉద్యోగాలు ఇవ్వాలి. హారిజాంటల్‌ను కాదని 125 ర్యాంకు వచ్చిన అభ్యర్థికి ఉద్యోగం ఇలా ఇస్తారు?

షేక్ నసీమూన్- ర్యాంకు 43, బీసీ(ఇ): కడపలో ఈ కేటగిరీలో రెండే బయాలజీ పోస్టులున్నాయి. 4, 30 ర్యాంకులు వచ్చిన వారికి ఉద్యోగాలు వచ్చాయి.

బండారు యమున- ర్యాంకు 68, బీసీ(డి): విశాఖపట్నం జిల్లాలో ఈ కేటగిరీలో 5 ఫిజికల్ సైన్స్ పోస్టులున్నాయి. 30 ర్యాంకుతో నాలుగు పోస్టులు భర్తీ అయ్యాయి. 310 ర్యాంకు వచ్చిన అభ్యర్థికి క్రీడా కోటాలో హారిజాంటల్ విధానంలో ఉద్యోగం వచ్చింది.

ఎర్రిపల్లి శ్రవణ్‌కుమార్- ర్యాంకు 53, బీసీ(ఎ): విశాఖపట్నంలో ఈ కేటగిరీలో నాలుగు ఫిజికల్ సైన్స్ పోస్టులున్నాయి. 31 ర్యాంకుతో రెండు పోస్టులు భర్తీ అయ్యాయి. 114 ర్యాంకరుకు మహిళా కోటాలో, 417 ర్యాంకరుకు పీహెచ్ కోటాలో ఉద్యోగాలు వచ్చాయి. దీంతో శ్రవణ్‌కుమార్‌కు ఉద్యోగం రాలేదు.

సమదం పృధ్వీరాజు- ర్యాంకు 157, బీసీ(బి): జోన్-1లో టీజీటీ తెలుగు పోస్టులు ఐదు పోస్టులున్నాయి. 141 ర్యాంకు వరకే ఐదు పోస్టులు భర్తీ అయ్యాయి. ఇక 157 ర్యాంకరుకు ఉద్యోగం వచ్చే పరిస్థితే లేదు.

విషయాలను గ్రీవెన్స్ స్థాయిలో అప్పట్లోనే అభ్యర్థులకు వివరించాం. కానీ హారిజాంటల్ రిజర్వేషన్ అర్థం కాక తమకు ఉద్యోగాలు ఇవ్వలేదని అనుకుంటున్నారు. ఇప్పుడు దానిపై అవాస్తవ ప్రచారం చేస్తున్నారు. మెరిట్ ర్యాంకులు కాదని.. తర్వాత ర్యాంకుల వారికి ఉద్యోగాలు ఎలా వస్తాయని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ప్రశ్నించారు.

దుష్ప్రచారంపై కేసు నమోదు "పూర్తి పారదర్శకంగా మెగా డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేసినా, కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారు. అసత్య ప్రచారం చేస్తున్న వారిపై ఓ కేసు నమోదు చేశాం.

# సినిమా



## ఆయన లేకపోతే నేను ఇంత పెద్ద హీరోయిన్ అయ్యేదాన్ని కాదు..

ఒకప్పుడు తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ విజయశాంతి. అప్పట్లో స్టార్ హీరోలకు మించిన క్రేజ్.. పారితోషికంతో అగ్ర కథానాయికగా ఓ వెలుగు వెలిగింది. మెగాస్టార్ చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్ వంటి స్టార్ హీరోలతో కలిసి ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను అందించారు. సినిమా పరిశ్రమలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు, హీరో ఇమేజ్ తెచ్చుకోవడం చాలా కష్టమని నటి విజయశాంతి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన అనుభవాలను పంచుకున్నారు. ముఖ్యంగా ఒక మహిళగా, హీరోలతో సమానంగా పారితోషికం, గౌరవం సంపాదించుకోవడం మామూలు విషయం కాదని ఆమె పేర్కొన్నారు. యాక్షన్ పాత్రల కోసం మానసికంగా సిద్ధపడటం, శారీరక శ్రమకు అలవాటు పడటం సులభం కాదని విజయశాంతి వివరించారు.యాక్షన్ సన్నివేశాల్లో నటించడం అలవాటు పడటానికి తనకు కొంత సమయం పట్టిందని, తన శరీరాకృతిని, నటన శైలిని ఒక రఫ్ అండ్ టఫ్ హీరో బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా మార్చుకోవాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. మొదటి చిత్రం నుండి క్రమంగా తన ఫైట్స్ మెరుగుపరుచుకుంటూ వెళ్ళానని, అప్పట్లో గ్రాఫిక్స్ లేని కారణంగా ప్రతి సాహసాన్ని ఒరిజినల్‌గానే చేయాల్సి వచ్చేదని గుర్తు చేసుకున్నారు. డూప్ లేకుండా 20-30 అడుగుల ఎత్తు నుండి దూకడం, గన్‌తో షూట్ చేయడం వంటి సన్నివేశాలను ఎంతో కష్టపడి చేశానని ఆమె వెల్లడించారు. ఈ ప్రయత్నాల ద్వారా తాను ఒక యాక్షన్ హీరోయిన్‌గా, హీరోలు మాత్రమే కాకుండా హీరోయిన్లు కూడా ఇలాంటి పాత్రలు చేయగలరని నిరూపించుకోగలిగానని విజయశాంతి అన్నారు.ఈ ప్రయాణంలో దర్శకుడు టి.కృష్ణ (హీరో గోపిచంద్ తండ్రి ) పాత్ర ఎంతో కీలకమని విజయశాంతి కృతజ్ఞతలు తెలిపారు. తనలోని నటనా సామర్థ్యాన్ని "నేటి భారతం" చిత్రం ద్వారా టి.కృష్ణ బయటకు తీసుకువచ్చారని, అప్పటి వరకు కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం అనుకున్న తనను నటనపరంగా నిరూపించుకునే అవకాశం కల్పించారని ఆమె పేర్కొన్నారు. తను కేవలం గ్లామర్ హీరోయిన్ కాదని, నటించగల సామర్థ్యం ఉందని ప్రజలు గుర్తించడానికి టి.కృష్ణ గారే కారణమని ఆమె అన్నారు. విప్లవాత్మకమైన కథలకు, పాత్రలకు తాను సరిపోతానని టి.కృష్ణ గారు బలంగా నమ్మేవారని, తన రాసిన కథలకు విజయశాంతి న్యాయం చేయగలరని ఆయన భావించేవారని ఆమె వివరించారు.అందుకే టి.కృష్ణ తన ప్రతి చిత్రంలోనూ విజయశాంతినే కథానాయికగా తీసుకునేవారని, ఒక సందర్భంలో అన్ని సినిమాల్లో తనే కనిపిస్తున్నానని, వేరొక హీరోయిన్‌ను తీసుకోమని అడిగినా కూడా, "శాంతమ్మ నువ్వే చేయాలి, నువ్వే బాగా చేస్తావు" అని చెప్పేవారని విజయశాంతి పంచుకున్నారు. "ప్రతిఘటన" చిత్రం విషయానికి వస్తే, డేట్స్ కుదరక తాను చేయలేనని చెప్పినా, "నువ్వు చేయకపోతే నేను సినిమా తీయను" అని టి.కృష్ణ పట్టుబట్టారని, చివరికి ఇతర నిర్మాతలందరినీ ఒప్పించి ఒక నెల డేట్స్ తన కోసం కేటాయించారని ఆమె గుర్తు చేసుకున్నారు. విశాఖపట్నం వెళ్లి ఆ సినిమా పూర్తి చేశానని, ఆ సినిమాతోనే తనకు సూపర్‌స్టార్ అనే బిరుదు లభించిందని విజయశాంతి ఎంతో ఆనందంగా తెలిపారు. టి.కృష్ణ ప్రోత్సాహం, ఆయన విశ్వాసం వల్లే తాను ఈ స్థాయికి చేరుకోగలిగానని ఆమె పేర్కొన్నారు.



# ఖర్జూరాలు అంటే మీకు మహా ఇష్టమే..



ఖర్జూరం అనేకమందికి ప్రీతిపాత్రమైన ఆహారం. అయితే, దానిని కొనుగోలు చేసేటప్పుడు గడువు తేదీని తనిఖీ చేయాల్సిన ప్రాముఖ్యతపై అవగాహన ఉండాలి. ఇటీవల గడువు ముగిసిన ఖర్జూరాలను ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు గుర్తిస్తున్న ఘటనలు కూడా చూస్తున్నాం. దీంతో ఖర్జూరం ప్రియులలో కొంత ఆందోళన కలిగించింది. మరి గడువు ముగిసిన ఖర్జూరాన్ని ఎలా గుర్తించాలి? అలాంటి ఖర్జూరం తింటే కలిగే ప్రమాదాలేమిటి? ఖర్జూరం దిగుమతిపై వివరాలు పరిశీలిస్తే, వరల్డ్ బ్యాంక్ వరల్డ్ ఇంటిగ్రేటెడ్ ట్రేడ్ సొల్యూషన్ 2023 డేటా ప్రకారం, ప్రపంచంలోనే అత్యధికంగా ఖర్జూరాన్ని దిగుమతి చేసుకునే దేశం భారత్. ఏటా 2000 కోట్ల రూపాయలకు పైగా విలువైన ఖర్జూరాన్ని భారత్ వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. ఇందులో 45% యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచే వస్తుంది. ఇరాక్, ఇరాన్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఖర్జూరంలో ఉండే తీయదనం, డ్రైనెస్, తేమ వంటి లక్షణాల ఆధారంగా వాటిని వివిధ రకాలుగా విభజిస్తారు.ఖర్జూరాలను ఎంతకాలం సురక్షితంగా నిల్వ చేయవచ్చు లేదా తినవచ్చు అనే దానిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) ఎటువంటి నిర్దిష్ట సూచనలు చేయలేదు. అయితే, సాధారణంగా ఖర్జూరం స్వభావం, నిల్వ పద్ధతులను బట్టి ఆరు నెలల నుంచి గరిష్టంగా ఒక సంవత్సరం వరకు నిల్వ చేసి తినవచ్చని అధికారులు చెబుతున్నారు. ఖర్జూరం డ్రై ఫ్రూట్స్ కావడంతో, దిగుమతి అయినప్పటి నుంచి ఒక సంవత్సరం వరకు కాలాన్ని లెక్కించి, దాని ప్రకారం ప్యాకింగ్ తేదీ, ఎక్స్పైరీ తేదీని ప్యాకెట్లపై ముద్రిస్తారు. ఈ సమయం కంటే ఎక్కువ కాలం నిల్వ ఉంచితే, అవి సహజంగానే చెడిపోతాయని ఫుడ్ సేఫ్టీ అధికారులు చెబుతున్నారు. అటువంటి ఖర్జూరంలో పురుగులు, ఇతర కీటకాలు పెరిగి, వాటిని తిన్నవారు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఖర్జూరంలోని పోషకాల గురించి పోషకాహార నిపుణులు సైతం కొన్ని సూచనలు ఇస్తున్నారు. ఖర్జూరంలో విటమిన్ బి6, పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్, చక్కెర వంటి పోషకాలు ఉంటాయి. అయితే, గడువు ముగిసిన ఖర్జూరంతో అనేక హానికరమైన ప్రమాదాలున్నాయి. ఖర్జూరాలు చెడిపోయినట్లు సాధారణంగా కంటికి కనిపించకపోవడమే ప్రధాన సమస్య. అధిక వేడి, అధిక తేమ ఉన్న ప్రదేశాలలో ఖర్జూరం వంటి అన్ని సహజ ఆహార పదార్థాలకు బూజు పడుతుంది. ఇది క్యాన్సర్‌కు కారణమయ్యే అఫ్లాటాక్సిన్‌ను ఉత్పత్తి చేసే మైకోటాక్సిన్‌లను కలిగి ఉంటుంది, ఇది నేరుగా కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ ఫంగస్ అభివృద్ధి చెందే అవకాశం ఎక్కువ. ఎక్కువ బూజు పట్టిన ఖర్జూరం తిన్న కొందరికి వాంతులు, తల తిరుగుతున్నట్లు అనిపించవచ్చని నిపుణులు తెలిపారు. కొన్ని ఖర్జూరాలకు ముదురు నలుపు రంగు రావడానికి, అవి చెడిపోకుండా ఉంచడానికి సల్ఫేట్లను కలుపుతారని కొన్ని అధ్యయనాల్లో తేలింది. ఈ సల్ఫేట్ విచ్ఛిన్నమైనప్పుడు, అది ఆస్తమా, అలర్జీలకు కారణం కావచ్చుట. కాబట్టి, ప్యాకెట్లపై ఉండే లేబుళ్లను జాగ్రత్తగా గమనించి, గడువు తేదీని నిర్ధారించుకున్న తర్వాతే ఖర్జూరం కొనుగోలు చేయడం మంచిది. వినియోగదారులు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి.

# పచ్చి మామిడి కాయతో ఆరోగ్యానికి పిచ్చి లాభాలు.



వేసవి రాగానే అందరికీ ముందుగా గుర్తొచ్చేది పండ్ల రాజైన మామిడి పండు. ఆ తియ్యని, రసవంతమైన రుచిని ఇష్టపడని వారుండరు. అయితే కేవలం పండు మాత్రమే కాదు.. పుల్లగా ఉండే పచ్చి మామిడికాయ కూడా ఈ సీజన్‌లో ఒక అమృతం లాంటిదనే చెప్పాలి. ఉగాది పచ్చడి నుండి నోరూరించే ఆవకాయ వరకు, ఘాటైన చట్నీల నుండి చల్లని ఆమ్ పన్నా వరకు పచ్చి మామిడికాయలను ప్రతి ఇంట్లో రకరకాలుగా వాడుతుంటారు. పచ్చి మామిడికాయ కేవలం నోటికి రుచిని అందించడమే కాదు.. ఎండ తీవ్రత నుండి మన శరీరాన్ని కాపాడే బోలెడన్ని పోషకాల గని అని నిపుణులు చెబుతున్నారు. ఇందులో విటమిన్ ఎ, సి, కె, బి6 లతో పాటు ఫైబర్, ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. వేసవిలో పచ్చి మామిడికాయను మన డైట్‌లో చేర్చుకోవడం వల్ల కలిగే ఆ 6 అద్భుత ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం..

జీర్ణక్రియకు అమృతం.. మలబద్ధకానికి చెక్

నిపుణుల అభిప్రాయం ప్రకారం.. పచ్చి మామిడికాయలలో పీచుపదార్థం అత్యధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. వేసవిలో వేడి వల్ల వచ్చే మలబద్ధకం, కడుపు ఉబ్బరం, ఎసిడిటీ వంటి సమస్యలను నివారించడంలో పచ్చి మామిడికాయ ఒక దివ్యౌషధంగా పనిచేస్తుంది.

నిగనిగలాడే చర్మం.. దృఢమైన జుట్టు

పచ్చి మామిడిలో ఉండే విటమిన్ ఎ, విటమిన్ సి, జింక్, ఐరన్, విటమిన్ ఇ వంటి పోషకాలు మీ జుట్టుకు, చర్మానికి అద్భుతమైన పోషణను అందిస్తాయి. ఇందులోని విటమిన్ సి శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి చర్మంపై ముడతలు పడకుండా గ్లో తెస్తుంది. అలాగే ఐరన్, జింక్ జుట్టు కుదుళ్లను బలపరిచి జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి.

గుండె ఆరోగ్యానికి శ్రీరామరక్ష

పచ్చి మామిడికాయలలో శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి సహాయపడే పవర్‌ఫుల్ యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. అంతేకాకుండా వాటిలోని ఫైబర్, పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. తద్వారా మొత్తం గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది.

డయాబెటిస్ ఉన్నవారికి కూడా సేఫ్

పచ్చి మామిడికాయకు గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. దీనివల్ల ఇది తిన్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగవు. ఇందులో పీచుపదార్థం అధికంగా ఉండటం వల్ల, ఇది మధుమేహ రోగుల మెటబాలిజానికి ఎంతో ఉపయోగపడుతుంది. అయితే ఊరగాయల రూపంలో కాకుండా పచ్చి ముక్కలుగా లేదా పన్నా రూపంలో తీసుకోవడం మంచిది.

డీహైడ్రేషన్, వడదెబ్బ నుండి రక్షణ

ఎండల్లో తిరగడం వల్ల శరీరం లోని సోడియం క్లోరైడ్, స్వేదం రూపంలో బయటకు పోయి నీరసం వస్తుంది. పచ్చి మామిడికాయను కొద్దిగా ఉప్పు చల్లుకుని తినడం వల్ల లేదా దాని జ్యూస్ తాగడం వల్ల శరీరంలో ఎలక్ట్రోలైట్స్ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుంది. ఇది వడదెబ్బ తగలకుండా బాడీని చల్లబరుస్తుంది.

లివర్, గాల్ బ్లాడర్ క్లీనింగ్

పచ్చి మామిడి ముక్కలను నమలడం వల్ల లాలాజలం, పిత రసం ఉత్పత్తి పెరుగుతుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరచడానికి, ప్రేగులలో బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లను అరికట్టడానికి ఎంతగానో తోడ్పడుతుంది.

పచ్చి మామిడికాయ ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినప్పటికీ, దీనిని అతిగా తినకూడదు. ముఖ్యంగా కాయ కోసినప్పుడు వచ్చే జిగురు నోటికి లేదా పెదవులకు అంటకుండా జాగ్రత్తపడాలి, లేదంటే బొబ్బలు వచ్చే అవకాశం ఉంది.

# ఐపీఎల్ ఫైనల్‌కు ఊహించని గెస్ట్



ఐపీఎల్ 2026 ముగింపు వేడుకలకు సర్వం సిద్ధమైంది. నేడు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గుజరాత్ టైటాన్స్ మధ్య ఫైనల్ ఫైట్ జరగనుంది. అయితే ఈ రేసులో రాజస్థాన్ రాయల్స్ జట్టు ఫైనల్‌కు చేరనప్పటికీ, ఆ జట్టు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మాత్రం అహ్మదాబాద్‌లో తళుక్కున మెరిశాడు. ప్లేఆఫ్స్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయిన ఈ టీనేజ్ సెన్సేషన్, నేడు జరగబోయే గ్రాండ్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు వచ్చాడు. ఈ టోర్నమెంట్‌లో అతడు చూపించిన అసాధారణ ప్రదర్శనకు గాను స్టేడియంలో అతడిని సత్కరించే అవకాశం కూడా ఉంది. ఈ సీజన్ ప్లేఆఫ్స్ మ్యాచ్‌ల్లో వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్ రాయల్స్ తరఫున విధ్వంసకర బ్యాటింగ్‌తో రెచ్చిపోయాడు. మొదట సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో కేవలం 29 బంతుల్లోనే 12 సిక్సర్లు, 5 ఫోర్లతో ఏకంగా 97 పరుగులు సాధించాడు. ఇతడి ఊచకోత వల్లే రాజస్థాన్ జట్టు 243 పరుగుల భారీ స్కోరు చేసింది. ఆ తర్వాత గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన క్వాలిఫయర్-2 లో కూడా ఒంటరి పోరాటం చేస్తూ 47 బంతుల్లో 7 సిక్సర్లు, 8 ఫోర్లతో 96 పరుగులు చేసి జట్టుకు 214 పరుగుల గౌరవప్రదమైన స్కోరును అందించాడు.వైభవ్ సూర్యవంశీ క్వాలిఫయర్-2 లో అద్భుతంగా ఆడినప్పటికీ రాజస్థాన్ రాయల్స్‌కు విజయం దక్కలేదు. గుజరాత్ టైటాన్స్ జట్టు కంప్లీట్ డామినేషన్‌తో రాజస్థాన్ నిర్దేశించిన 214 పరుగుల లక్ష్యాన్ని చాలా సులువుగా ఛేజ్ చేసింది. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 104 పరుగులతో సెంచరీ బాదగా, ఓపెనర సాయి సుదర్శన్ 58 పరుగులతో అదరగొట్టాడు. దీంతో రాజస్థాన్ రాయల్స్ టోర్నీ నుంచి నిష్క్రమించగా, గుజరాత్ టైటాన్స్ ఫైనల్లోకి అడుగుపెట్టింది.

ఫైనల్ మ్యాచ్‌కు ముందు వైభవ్ సూర్యవంశీ అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు అతడిని ఫైనల్ మ్యాచ్ వేదికపై ప్రత్యేకంగా సత్కరించే ఛాన్స్ ఉందని టాక్ నడుస్తోంది. అయితే ఈ సీజన్ ముగిసే సమయానికి ఆరెంజ్ క్యాప్ అతడి వద్దే ఉంటుందా లేదా అనేది ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది.

ప్రస్తుతం ఐపీఎల్ 2026 సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో వైభవ్ సూర్యవంశీ 16 ఇన్నింగ్స్‌ల్లో 776 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. రాజస్థాన్ టోర్నీ నుండి అవుట్ అయినందున వైభవ్‌కు ఇక మ్యాచ్‌లు లేవు. కానీ, రన్నర్ల జాబితాలో తర్వాతి స్థానాల్లో ఉన్న గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్‌లకు ఇంకా ఒక మ్యాచ్ మిగిలి ఉంది. వీరిద్దరూ ఫుల్ ఫామ్‌లో ఉండటంతో వైభవ్ ఆరెంజ్ క్యాప్ చేతులు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at HNo:21-119 west ibrahimpatnam,krishna andhrapradesh 521456Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2844. Ph:9849707349 . email:kvp6858@gmail.com.